



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY









SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 154 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ బుధవారం 25 ఫిబ్రవరి 2026 పేజీలు : 12 వెల : 2/-


### నాటి నుంచి హిందూ మతంపై

# వ్యవస్థీకృత దాడి



- తిరుమల గిరులను కుదించారు... కల్తీతో అపవిత్రం చేశారు
- తిరుమల డిక్లరేషన్‌పై జగన్ ధిక్కారం
- గత పాలనలో టీటీడీలో ఉద్దేశపూర్వకంగా అన్యమత ప్రచారం
- జరిగిన అపచారాలపై తీవ్రంగా స్పందించిన హైందవ మఠాలు
- హిందువుల మనోభావాలు కాపాడే బాధ్యత మాది
- కల్తీ నెయ్యి వ్యవహారంపై శాసనసభలో లఘు చర్చలో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- వైసీపీ హయాంలో మహాపాపం పేరిట సభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సీఎం

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓ పద్ధతి ప్రకారమే 2005 నుంచి హిందూమతంపై దాడి జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తిరుమల పరిధిని ఏడు కొండల నుంచి రెండు కొండలకు మాత్రమే పరిమితం చేస్తూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవో తీసుకువచ్చారని అప్పటి నుంచే హిందూ మతంపై క్రమబద్ధంగా దాడి చేస్తూ వచ్చారని ఆక్షేపించారు. అప్పటి పంచాయితీరాజ్ శాఖ కార్యదర్శిగా ఉన్న శామ్యూల్ అనే క్రైస్తవ అధికారి ఈ జీవో జారీ చేశారని వివరించారు. హిందూ సమాజంతో పాటు రెండేళ్ల పాటు తాము చేసిన పోరాటాల కారణంగా వెనక్కు తగ్గారని సీఎం స్పష్టం చేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై శాసనసభలో చేపట్టిన లఘు చర్చలో భాగంగా ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ వ్యవహారంపై మహాపాపం పేరిట అసెంబ్లీలో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వైసీపీ హయాంలో 20.01 కోట్ల లడ్డూ ప్రసాదాన్ని మిగతా .. 2లో..

### శ్రీకాకుళంలో డయేరియా అంశంపై

## సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీకాకుళంలో డయేరియా ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. మంగళవారం ఈ ఘటనపై వేర్వేరుగా రెండుసార్లు జిల్లా అధికారులతో మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో అందుతున్న వైద్యంపై సీఎం ఆరా తీశారు. శ్రీకాకుళం నగరంలో రోడ్ రిపేర్ పనుల కారణంగా డయేరియా వ్యాపించిందని అధికారులు మిగతా .. 2లో..

### కల్తీ పాల ఘటన నిందితుడికి

## 14 రోజుల రిమాండ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైన రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనలో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. విచారణ చేపట్టిన స్థానిక న్యాయస్థానం అతడికి 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. మరో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉన్న సంగతి తెలిసిందే. కిడ్నీ వైఫల్యం కేసులు బయట పడిన లాలాచెరువు సమీపం చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో పలు నమూనాలను సేకరించిన మిగతా .. 2లో..

### ఆస్ట్రేలియా ప్రధాని నివాసానికి

## బాంబు బెదిరింపు



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ కాన్‌బెర్రాలోని అధికారిక నివాసానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన భద్రతా దళాలు.. కొన్ని గంటల పాటు ఆయన్ను సురక్షిత ప్రాంతానికి తరలించాయి. భవనంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించామని, అక్కడ అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదని ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతానికి ప్రజల భద్రతకు ఎటువంటి ముప్పు లేదని పేర్కొన్నారు. కాన్‌బెర్రా అధికారిక నివాసం ది లాడ్జ్‌లో మంగళవారం మిగతా .. 2లో..

### బెంగాల్‌ను చూస్తుంటే

## గుండె తరుక్కుపోతోంది

**ఆ రాష్ట్ర ప్రజలకు మోదీ బహిరంగ లేఖ**



**కోల్‌కతా, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పాలనలోని పశ్చిమ బెంగాల్‌ను చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజకీయ మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. బెంగాల్‌ను 'బంగారు బంగ్లా'గా మారుస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆ రాష్ట్ర ప్రజలకు మోదీ సోమవారం బహిరంగ లేఖ రాశారు. మరికొద్ది నెలల్లో బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఆయన ఈ లేఖ రాయడం గమనార్హం.

**ప్రభుత్వం నుంచి సహకారం లేదు**

"బెంగాల్ ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేదు. అయినా రాష్ట్రంలో దాదాపు 5 కోట్ల మంది ప్రజలతో 'జన్ ధన్ యోజన' ఖాతాలు తెరిపించాం. 'స్వచ్ఛ భారత్ అభియాన్' కింద 85 లక్షల మరుగుదొడ్లు నిర్మించాం. బెంగాల్‌ను పాలిస్తున్న టీఎంసీ సర్కార్ పేదల జీవనోపాధిని లాక్కుంటోంది. 'అటల్ పెన్షన్ యోజన' కింద 56 లక్షల మంది వృద్ధులకు ఊరట కల్పించాం. 'ఉజ్వల యోజన' ద్వారా కోటి కుటుంబాలకు ఎల్‌పీజీ కనెక్షన్‌లను అందించాం. 'కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా మిగతా .. 2లో..

### నమూనాల ఫలితాలతోనే

## కల్తీ పాల మూలాలపై స్పష్టత

- మరో 3 నుంచి 5 రోజుల్లో పరీక్షల ఫలితాల రాక
- ఏడుగురి పరిస్థితి ఆందోళనకరం
- చెన్నై, ముంబై నుంచి రానున్న ప్రత్యేక మందులు
- నిలకడగా మిగిలిన వారి ఆరోగ్యం
- బాధితుల నివాస ప్రాంతాల్లోని స్థానికుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ
- 24 గంటలపాటు అందుబాటులో ఉండేలా వైద్యుల నియామకం
- పాలలో యూరియా కలిసిన ఆనవాళ్ల సమాచారం లేదు
- రాష్ట్ర వ్యాప్తంగా పాల విక్రయ కేంద్రాల్లో తనిఖీల కోసం ప్రత్యేక డ్రైవ్
- విలేకర్ల సమావేశంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు వీరపాండియన్, నీలకంఠారెడ్డి వెల్లడి




**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనకు సంబంధించి ఆసుపత్రిలో ఉన్న వారికి మెరుగైన వైద్యాన్ని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ మిగతా .. 2లో..

### వైసీపీ పాలనలో అన్ని శాఖలకు

## తాళాలు వేశారు

- గత ఐదేళ్లు రాష్ట్రం అస్తవ్యస్తంగా మారింది - పశుసంవర్ధక శాఖను నిర్వీర్యం చేసిన వైసీపీ
- పశువైద్యశాలలు పేరుకే మిగిలాయి, మందులు ,పరికరాలు లేవు,ని బ్బంది లేరు
- కూటమి ప్రభుత్వం వచ్చాకే పశుసంవర్ధక శాఖ పునరుజ్జీవనానికి చర్యలు

వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలోని అన్ని శాఖలకు తాళాలు వేసిన పరిస్థితి నెలకొందని, ముఖ్యంగా పశుసంవర్ధక శాఖను పూర్తిగా నిర్వీర్యం చేసి అభివృద్ధిని కుంటుపెట్టారని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం అసెంబ్లీలో తీవ్ర విమర్శలు చేశారు. శాసనసభలో ఎమ్మెల్యేలు పశు వైద్యశాలల్లో సౌకర్యాల కొరత, వైద్యుల నియామకాలపై మిగతా .. 2లో..

### 9 నుంచి ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్

## ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ



**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మహిళ, పురుష అభ్యర్థులకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ మార్చి 9 నుంచి గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)లో ప్రారంభమవుతుందని జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. గుంటూరు కలెక్టర్ మిగతా .. 2లో..

## ప్రజాప్రతినిధుల 'టగ్ ఆఫ్ వార్'..

**స్పీకర్‌పై డిప్యూటీ స్పీకర్ విజయం**



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు విజయవాడలో సందడిగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా 'టగ్ ఆఫ్ వార్' పోటీ ఆసక్తికరంగా జరిగింది. ఇందులో స్పీకర్ జట్టుపై డిప్యూటీ స్పీకర్ టీమ్ విజయం సాధించింది. స్పీకర్ తరపున పల్లా శ్రీనివాసరావు, జీవీ ఆంజనేయులు సహా సీనియర్ సభ్యులు, డిప్యూటీ స్పీకర్ జట్టులో మహిళా సభ్యులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొనడంపై సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

### తమిళనాట

## శశికళ కొత్త పార్టీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ సీఎం దివంగత జయలలిత సన్నిహితురాలు వీకే శశికళ కీలక ప్రకటన చేశారు. త్వరలో తాను కొత్త పార్టీని స్థాపించనున్నట్లు వెల్లడించారు. జయలలిత జయంతి సందర్భంగా రామనాథపురంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మిగతా .. 2లో..

### మంత్రి నారా లోకేశ్ పనితీరుపై


## హైకోర్టు ప్రశంస



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ మంత్రి నారా లోకేశ్ పని తీరును హైకోర్టు ప్రశంసించింది. కస్తూర్బా పాఠశాలల టీచర్ల జీతం పెంచుతామన్న ప్రకటనను అభినందించింది. పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేస్తామని మంత్రి ప్రకటన చేశారని వ్యాఖ్యానించింది. ప్రజా సమస్యలపై మంత్రి లోకేశ్ వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నారని తెలిపింది. హాస్టల్ విద్యార్థులను ఎలుకలు కరిచిన ఘటనపై వెంటనే స్పందించారని కితాబిచ్చింది. అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారంటూ హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.

### ల్యాండింగ్‌కి ముందు..

## సముద్రంలో పడిన హెలికాప్టర్..



**విశ్వం వాయిస్ న్యూస్ :** మరికాసేపట్లో ల్యాండ్ అవుతుందనగా.. ఓ హెలికాప్టర్ సముద్రంలో పడిపోయింది. మంగళవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో హెలికాప్టర్‌లో ఉన్న ఏడుగురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడినట్లు అధికారులు తెలిపారు. అండమాన్‌లోని పోర్ట్ బ్లెయిర్ నుంచి ఇద్దరు సిబ్బంది సహా ఐదుగురు ప్రయాణికులతో పవన్ హాన్స్ మిగతా .. 2లో..

## కేరళ పేరు.. ఇక కేరళం

**కేంద్ర క్యాబినెట్ ఆమోదం**



**విశ్వం వాయిస్ న్యూస్ :** దేవుడి సొంత భూమిగా పిలిచే కేరళ పేరు మారనుంది. ఈ రాష్ట్రం పేరును అధికారికంగా కేరళంగా మార్చేదిశగా కీలక అడుగు పడింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిపాదనకు మంగళవారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పేరు మార్పుపై కేంద్రాన్ని అభ్యర్థిస్తూ ఇప్పటికే కేరళ అసెంబ్లీ పలుమార్లు తీర్మానాలు చేసిన సంగతి తెలిసిందే. అధికారిక రికార్డుల్లో రాష్ట్రం పేరును సవరించాలంటూ తీసుకువచ్చిన తీర్మానానికి ఇటీవల కేరళ శాసనసభ ఆమోదం తెలపగా.. తాజాగా కేంద్ర క్యాబినెట్ దానిని మిగతా .. 2లో..

## నేను ఎంతకాలం ఉంటానో తెలియదు

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**



**విశ్వం వాయిస్ న్యూస్ :** తనపై జరుగుతోన్న వరుస హత్యాయత్నాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. తనను హత్య చేయడానికి చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నారని.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే తాను ఎంత కాలం ఉంటానో కూడా తెలియట్లేదన్నారు. ఇటువంటి షూటర్లు సాధారణ అధ్యక్షుల జోలికి వెళ్లరని.. కేవలం అసాధారణ విజయాలు సాధించే అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా అమెరికా మాజీ అధ్యక్షులు అబ్రహం లింకన్, జాన్ ఎఫ్. కెన్నడీ హత్య ఘటనలను ఉదాహరణగా పేర్కొన్నారు. ఇలాంటి ఎన్ని బెదిరింపులకు పాల్పడినా.. తాను తీసుకునే నిర్ణయాలపై ఏ మాత్రం వెనక్కి తగ్గబోనన్నారు. ఇటీవల ఫ్లోరిడాలోని మిగతా .. 2లో..

### పోలీసుల ఎదుట లొంగిపోయిన

## మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మావోయిస్టు కేంద్ర కమిటీ అప్రకటిత కార్యదర్శి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ మంగళవారం తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. ఆయనతో పాటు బడే చొక్కారావు, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డి కూడా లొంగిపోయారు. ఈ మేరకు డీజీపీ శివధర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలను ప్రకటించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. "గత రెండేళ్లలో నలుగురు సీసీఎంలు, 16మంది ఎస్ఈఎంలు, 26మంది డివిజన్ కమిటీ సభ్యులు, సెక్రటరీలు.. 85 మంది ఏసీఎస్‌లు, 60 మంది పార్టీ సభ్యులు సహా మొత్తం 591 మంది జన జీవన స్రవంతిలోకి వచ్చారు. తెలంగాణలో పుట్టి, పెరిగిన 11 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారు. వాళ్లలో కొంతమంది మాతో చర్చలు జరుపుతున్నారు. త్వరలోనే వారు కూడా బయటకు వస్తారు. పోలీసుల మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# నాటి నుంచి హిందూమతంపై వ్యవస్థీకృత దాడి

కల్తీ నెయ్యితో తయారు చేసి ఘోర అపచారం చేశారని ముఖ్యమంత్రి అన్నారు. రాజకీయ వివాదం ఉండకూడదని సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికారులతో సిట్ ఏర్పాటైందని సీఎం వివరించారు. సీబీఐ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేసి విచారణ చేయాలని ఆదేశించినట్టు తెలిపారు. తప్పు చేసిన నిందితులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపించిందని అన్నారు. అందుకే ఈ వ్యవహారంపై ఏకసభ్య కమిటీ వేయాలని నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి తెలిపారు. లడ్డూ వ్యవహారంలో అనేక తప్పులు చేశారని సీఎం స్పష్టం చేశారు. 2019-24 మధ్య 59.71 లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగించారని అన్నారు. రూ. 231.51 కోట్ల అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనల్ని నీరుగార్చారని స్పష్టం చేశారు. కల్తీ నెయ్యి వ్యవహారం ఓ ప్రణాళిక ప్రకారం లాలూచీ పడిన లూటి అని స్పష్టంగా తేలిందన్నారు. కల్తీ నెయ్యి అని నిర్ధారణ అయినా... నివేదికలు వచ్చినా అప్పటి టీటీడీ ఛైర్మన్ దానిని తొక్కి పెట్టారని అన్నారు. లడ్డూలో జంతు కొవ్వు కలిసిందని తానేమి సొంతగా చెప్పలేదని ఎన్డీడీబీ కాఫ్ ఇచ్చిన నివేదికనే బయటకు వెల్లడించానని అన్నారు.

**అప్పటి బోర్డుకు, ఛైర్మన్‌కు తెలియకుండా తప్పులు జరిగాయా...?**

కల్తీ నెయ్యి సరఫరాకు అనుగుణంగా టెండర్ నిబంధనల్ని సడలించారని.. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు సరఫరా చేయాలన్న నిబంధన తొలగించారని పేర్కొన్నారు. నెయ్యి ఉత్పత్తిలో అనుభవాన్ని 3 ఏళ్ల నుంచి 1 ఏడాదికి కుదించారన్నారు. రోజుకు 12 టన్నుల వెన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని 8 టన్నులకు తగ్గించారని అన్నారు. అక్రమాలకు తెరతీసేలా డెయిరీల వార్షిక టర్నోవర్ రూ.250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు పరిమితం చేశారన్నారు. సాంకేతిక అధ్యయనం, ఫీల్డ్ విజిట్లకు పూర్తిగా మినహాయింపు ఇచ్చారని.. వీటితో పాటు ఫుడ్ సేఫ్టీ నిబంధనల్ని కూడా నీరుగార్చారన్నారు. ఈ కల్తీ నెయ్యి వ్యవహారంలో ప్రధాన సూత్రధారులుగా పోమిల్ జైన్ , విపిన్ జైన్ తో పాటు భోలే బాబా ఆర్గానిక్ డెయిరీ ఉందన్నారు. ఏఆర్, శ్రీవైష్ణవీ, మాల్ గంగా డెయిరీలు భోలే బాబా డెయిరీకి షెల్ కంపెనీలుగా వ్యవహరించి కల్తీ నెయ్యి సరఫరా చేశారని సీఎం స్పష్టం చేశారు. రూ.4.5 కోట్ల లంచం డబ్బుతో నాటి ఛైర్మన్ పీఏ చిన్నప్పన్న అడ్డంగా దొరికి పోయారని సీఎం తెలిపారు. తప్పుడు రిటర్నులతో తప్పుదారి పట్టించారని.. ల్యాబ్ నివేదికల్ని కూడా ఫోర్జరీ చేశారన్నారు. ల్యాబ్ ల కన్నుగప్పి టెండర్లు దక్కించుకున్నారని అన్నారు. కల్తీ నెయ్యి తయారీకి, సరఫరాకు ఓ ముఠాగా ఏర్పడ్డారని... తయారికి వివిధ రకాల రసాయనాలు వినియోగించినట్టు కూడా సిట్ తేల్చిందన్నారు. శ్రీవారి ప్రసాదాన్ని కలుషితం చేసి ఘోర అపచారం చేశారని ముఖ్యమంత్రి అన్నారు. టీటీడీలోని సాంకేతిక నిపుణులకు కూడా ఖరీదైన ఫోన్లు ఎరవేసి కల్తీ నెయ్యికి గేట్లు తెరిచారన్నారు. మోనో గ్లిసరైట్, ఎసిటిక్ యాసిడ్ లాంటి ద్రమ్ములను, లంచాల వివరాలతో కూడిన డైరీని కూడా సిట్ స్వాధీనం చేసుకుందని తెలిపారు. ఈ కుట్రకు పాల్పడిన నిందితులపై సిట్ అభియోగాలు కూడా మోపిందన్నారు. తప్పు చేసిన వ్యక్తులు ఇప్పుడు మళ్లీ బుకాయించి మాపైనే ఆరోపణలు చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇవన్నీ టీటీడీ బోర్డు ఛైర్మన్ కు తెలియకుండా జరుగుతాయా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఆ సమయంలో ప్రసాదం తీసుకున్న ప్రతీ ఒక్కరూ నాణ్యత తగ్గిందని చెప్పారని వివరించారు.

**టీటీడీని అన్యమతస్తులతో నింపేశారు**

ఎవరికి ఏ బాధ వచ్చినా శ్రీ వేంకటేశ్వరస్వామిని మొక్కుకుని ఆయనతో చెప్పుకుంటామని.. 2019-24 మధ్య స్వామి వారికి జరిగిన అపచారం పట్ల తీవ్ర ఆవేదన చెందామని అన్నారు. శ్రీవారి ఆలయంలో అన్యాయం జరుగుతోందని, రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని పోరాడితే కేసులు పెట్టి వేధించారని శాసనసభలో సీఎం వివరించారు. రామతీర్థంలో రాముడి తల నరికారని అక్కడికి వెళ్తే తన పైనా కేసులు పెట్టారని తెలిపారు. బ్రిటీషర్లు కూడా తమ పాలనలో తిరుమల శ్రీవారి జోలికి వెళ్లలేదని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. సామాన్య భక్తులు ఏడు కొండలవాడా గోవిందా అనే నామాన్ని స్మరిస్తూ తిరుమలకు వెళ్తారని అలాంటి ఏడు కొండలను రెండు కొండలకు కుదిస్తూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి దాడి మొదలెట్టారని అన్నారు. ఈ నిర్ణయంపై రెండేళ్ల పాటు దేశంలోని హిందువులంతా తీవ్ర ఆందోళనలు చేయటంతో ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారని అన్నారు. ఈ అంశంపై పోరాటం చేసిన తనపైనా ఆరోపణలు, ఫేక్ ప్రచారం చేశారని ముఖ్యమంత్రి వివరించారు. ఉడిపి పెజోవర్ మఠాధిపతి విశ్వేశ్వర తీర్థ స్వామిజీ ఆదేశం మేరకు ఏర్పాటు అయిన ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ తిరుమలలో అన్యమత జోక్యంపై నివేదిక ఇచ్చిందన్నారు. తిరుమలతో పాటు అక్కడి విద్యా సంస్థల్లో అన్యమత ప్రచారం జరిగిందని, ఉద్యోగులు, దుకాణాల్లోనూ అన్యమతస్తులు ఉన్నట్టుగా తేల్చిందని వివరించారు. గతంలో తిరుమల స్పెసిఫైడ్ అథారిటీ అధ్యక్షుడిగానూ క్రైస్తవుడైన అధికారిని తప్పించాలని ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ నివేదిక ఇచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. శ్రీవేంకటేశ్వరా యూనివర్సిటీ, పద్మావతి విశ్వవిద్యాలయాలకు కూడా వీసీలుగా క్రిస్టియన్లనే వైఎస్ రాజశేఖర్ రెడ్డి నియమించారని పేర్కొన్నారు. వారి హయాంలో బలవంతపు మత మార్పిడులు కూడా జరిగాయని ఆరోపణలు వచ్చినట్టు వివరించారు. 2019 వైసీపీ అధికారంలోకి వచ్చాక తిరుమలకు వెళ్లే ఆర్టీసీ బస్సు టికెట్లపైనా జెరుసలేం యాత్రకు వెళ్లాలంటూ అన్యమత ప్రచారం చేశారన్నారు.

**తిరుమల అంటే గత పాలకులకు చులకన**

లేని పింక్ డైమండ్ చోరీ అంటూ గతంలో తనపై దుష్ప్రచారం కూడా చేశారని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. శ్రీవారిని అప్రతిష్టపాలు చేసే కుట్రకు ఇది మరో ఉదాహరణ అని అన్నారు. జంబో పాలక మండలి నియామకంతో రాజకీయ పునరావాసంగా టీటీడీని మార్చేశారని సీఎం అన్నారు. హైకోర్టు తప్పు పట్టటంతో గత పాలకులు ఆ జీవోను వెనక్కు తీసుకున్నారని తెలిపారు. పరకామణిలో చోరీ జరిగితే దానిని కూడా సెటిల్ చేసేందుకు రాజీ ప్రయత్నాలతో పాటు చోరీని సమర్థిస్తూ చులకనగా గత పాలకులు మాట్లాడారని వివరించారు. దేవదేవుడి హుండీలో చోరీ జరిగితే ఇంత చులకనగా మాట్లాడతారా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. తిరుమల క్షేత్రానికి వెళ్లిన ఎవరైనా అక్కడ నిర్దేశించిన ఆచార సంప్రదాయాలను పాటిస్తారని... శ్రీవారి ఆలయానికి వెళ్లి డిక్లరేషన్ పై సంతకం చేయమంటే చేయకుండా గత పాలకుడు ధిక్కరించారని అన్నారు. డిక్లరేషన్ పై క్యాన్సిల్ అని నమోదు చేసి దౌర్జన్యం ప్రదర్శించారని ఆక్షేపించారు. అధికారం ఉంది కదా అని అహంభావంతో ప్రవర్తించారని ఆక్షేపించారు.

**కూటమి వచ్చాకే టీటీడీ ప్రక్షాళన**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే టీటీడీలో ప్రక్షాళనా చర్యలు మొదలు పెట్టామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. శ్రీవారి లడ్డూ ప్రసాద నాణ్యతను పెంచామని... ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ధృవీకరణ తర్వాతే లడ్డూ తయారీకి వినియోగించే పదార్థాలు కొనుగోలు చేసేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. భక్తులకు వడ్డించే అన్న ప్రసాద పాత దిట్టాన్ని తిరిగి అమల్లోకి తీసుకువచ్చామని... నాణ్యత, రుచి కూడా పెరిగాయని.. 98 శాతం మంది భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారని సీఎం శాసనసభలో వివరించారు. పీఏసీ 5 వెంకటాద్రి నిలయం వద్ద ఆధునిక వసతులతో వంటశాల అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. భక్తులకు కేటాయించే గదులు, కాటేజీలను కేంద్రీకృతం చేసి దర్శనాలతో అనుసంధానించామని వివరించారు. బ్రేక్ దర్శనాలను కూడా నియంత్రించి సాధారణ భక్తుల దర్శన సమయం పెంచామన్నారు. రద్దీ నియంత్రణ కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్ నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లోనూ ఈ క్యూ మేనేజ్మెంట్ సిస్టం అమలు చేస్తామని చెప్పారు.

**హెరిటేజ్ నీతి నిజాయితీతో నిలబడింది**

కుటుంబ వ్యాపార సంస్థగా ఉన్న హెరిటేజ్ ప్రభుత్వంతో ఎక్కడా ఒప్పందాలు చేసుకుని ఉత్పత్తులు విక్రయించలేదని సీఎం స్పష్టం చేశారు. ఏ ప్రభుత్వ శాఖ హెరిటేజ్ నుంచి ఒక్క కిలో నెయ్యి కూడా కొనుగోలు చేయలేదన్నారు. ప్రభుత్వ సహకారం లేకుండానే నీతి నిజాయితీతో హెరిటేజ్ నిలబడిందని శాసనసభలో వివరించారు. అయినా సాక్షి పత్రికలో ఇష్టానుసారంగా కథనాలు రాశారన్నారు. నేరస్తులు ఏ విధంగా సంస్థల క్రెడిబిలిటీని దెబ్బతీస్తారు అనటానికి ఈ రాతలే పెద్ద ఉదాహరణ అన్నారు. గత పాలనలో భారతీ సిమెంట్స్ నుంచి హౌసింగ్ పథకాలు, ప్రాజెక్టుల్లో సిమెంట్ కొనుగోలు చేశారని దీనిపై తామేమి మాట్లాడ లేదని అన్నారు. నెయ్యి వ్యవహారాన్ని హెరిటేజ్ డెయిరీతో ముడిపెట్టే ప్రయత్నం చేశారని సీఎం ఆక్షేపించారు. రోజూ 20 లక్షల లీటర్ల పాలు సేకరించి విక్రయిస్తున్న హెరిటేజ్ నీతి నిజాయితీతో వ్యాపారం చేస్తోందని తెలిపారు. ఇందాపూర్ డెయిరీకి హెరిటేజ్ కు నెయ్యి విషయంలో అసలు సంబంధమే లేదని వివరించారు. పూణేలో ఉన్న ఇందాపూర్ డెయిరీ ప్రసిద్ధ కంపెనీలన్నిటికీ కో మాన్యుఫాక్చరింగ్ చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. మదర్ డెయిరీ, బ్రిటానియా, ఆయుర్వేద ఘీ పతంజలి, డిమార్ట్, రిలయన్స్, దొడ్ల, హాడ్సన్ , జీఆర్బీ, అముల్, హెరిటేజ్ ప్రముఖ సంస్థలకు ఉత్పత్తుల కో మాన్యుఫాక్చరింగ్ చేస్తోందన్నారు. రాజమహేంద్రవరంలో పాల కల్తీ ఘటన జరిగితే దానిపై చర్చించకుండా మండలిలో అడ్డుకున్నారని ముఖ్యమంత్రి అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఈ ఘటనపై చర్చించి తగిన చర్యలు చేపట్టిందని తెలిపారు. గత పాలకులు చేసిన తప్పుల్ని ఒప్పుకోవాలని... దేవాలయాల పవిత్రతను దెబ్బ తీయవద్దని సీఎం హితవు పలికారు. తప్పుచేసిన వ్యక్తులే తమను క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. హైందవ ధర్మంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నానన్నారు. వేర్వేరు మతాలకు చెందిన వారి మనోభావాలను దెబ్బతీసే అధికారం మరొకరికి లేదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

# 14 రోజుల రిమాండ్

వైద్యాధికారులు పరీక్షలు నిర్వహిస్తున్నారు. బాధితుల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఆయా ప్రాంతాల్లో మరో నెల రోజుల పాటు పరిస్థితులు పర్యవేక్షిస్తామని ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ మీడియాకు తెలిపారు.

# బాంబు బెదిరింపు

సాయంత్రం ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ఉన్న సమయంలోనే బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో సాయంత్రం 6 గంటలకు ఆయన్ను సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లిన భద్రతా సిబ్బంది.. తనిఖీలు పూర్తిచేసిన తర్వాత 9గంటలకు తిరిగి ఆ భవనానికి తీసుకువచ్చారు.

# ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కార్యాలయంలో రిక్రూట్‌మెంట్ ర్యాలీపై అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ ఎయిర్‌ఫోర్స్ రిక్రూటింగ్ డైరెక్టర్, వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ మాట్లాడుతూ.. మార్చి 9, 10 తేదీల్లో మహిళా అభ్యర్థులకు, 12, 13 తేదీల్లో ఏపీ, 15, 16 తేదీల్లో తెలంగాణలోని పురుష అభ్యర్థులకు ఓపెన్ ర్యాలీ జరుగుతుందన్నారు.

# సముద్రంలో పడిన హెలికాప్టర్..

హెలికాప్టర్ బయలుదేరింది. 9:30 గంటలకు అది సముద్రంలో పడిపోయిందని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. హెలికాప్టర్‌లో ఉన్న మొత్తం ఏడుగురిని రక్షించామని.. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొన్నారు. మాయా బందర్‌లో ల్యాండ్ కావాల్సి ఉండగా.. రన్‌వేకి దాదాపు 300 మీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తిందని.. దీంతో పైలట్ సముద్రంలో క్రాష్ ల్యాండింగ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పౌర విమానయాన అధికారి వెల్లడించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

# గుండె తరుక్కుపోతోంది

52 లక్షల మంది రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం చేస్తున్నాం" అని మోదీ పేర్కొన్నారు.

**రాష్ట్రంలో హింస, అరాచకత్వం**

"బెంగాల్ దేశ ఆర్థిక వ్యవస్థ దిశను నిర్ణయించేది. నేడు రాష్ట్రం దీనావస్థలో ఉంది. 6 దశాబ్దాల బుజ్జగింపు రాజకీయాలు.. బెంగాల్‌కు కోలుకోలేని నష్టాన్ని తెచ్చిపెట్టాయి. ఓ వైపు ఉపాధి లేక యువత వలస వెళుతోంది. మరోవైపు రాష్ట్రంలోని మహిళలు తమకు భద్రత లేదని భావిస్తున్నారు. స్వామి వివేకానంద, రిషి అరబిందో కలలు కన్న బెంగాల్ నేడు ఓటు బ్యాంకు రాజకీయాలు, హింస, అరాచకత్వంతో నిండిపోయింది. బెంగాల్‌ను పునర్నిర్మిద్దాం. 2026 నాటికి రాష్ట్రాన్ని వికసిత్ బెంగాల్‌గా మారుస్తామని ప్రమాణం చేద్దాం' అని మోదీ అన్నారు.

# కల్తీ పాల మూలాలపై స్పష్టత

వెల్లడించారు. పాలలో యూరియా ఆనవాళ్ల గురించి ఇప్పటివరకు తమ దృష్టికి రాలేదని చెప్పారు. ఒకవేళ పాలలో యూరియా కలిసినట్లయితే వెంటనే కిడ్నీ ఫెయిల్యూర్, కాలేయం దెబ్బతినడం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. యూరియా కలిసిన పాలను దీర్ఘకాలం సేవిస్తేనే కిడ్నీ, లివర్ ఫెయిల్యూర్, మూత్రం రాకుండా స్తంభించడంవంటి సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెప్పారని తెలిపారు. ఇథలిన్ గ్లైకాల్ కలిసిన పాలను సేవించిన మూడు, నాలుగు రోజులకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని కూడా చెప్పారని పేర్కొన్నారు. అసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్త కేసులు మంగళవారం ఏమీ నమోదుకాలేదన్నారు. మంగళగిరిలోని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో ఇన్స్టిట్యూటు ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఫుడ్ సేఫ్టీ డిపార్టుమెంటు) డైరెక్టర్ నీలకంఠారెడ్డితో కలిసి వీరపాండియన్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు రాజమహేంద్రవరంలో జరిగిన ఘటనకు సంబంధించి పాలను శీతలికరణచేసే మిషన్లో కూలెంటుగా ఉపయోగించిన ఇథలిన్ గ్లైకాల్ లీక్ అయినట్లు పోలీసుల విచారణలో గుర్తించారని చెప్పారు. తాము బాధితుల ఇళ్లల్లో ఉపయోగించగా మిగిలిన పెరుగు, నెయ్యి, వెనిగార్, పాల నమూనాలను 10 వరకు సేకరించి వాటిని పరీక్ష నిమిత్తం హైదరాబాద్, కాకినాడలోని జాతీయ ఆహార భద్రత సంస గుర్తించిన ప్రయోగశాలలకు పంపించామని తెలిపారు విక్రేత విక్రయించిన పాలు దొరకలేదని, అయితే పెరుగు, పన్నీర్, నెయ్యి, మీగడ నమూనాలు సేకరించామన్నారు నీటి ఫలితాలు బుధవారం నుంచి శనివారం మధ్య దశల వారీగా వచ్చే అవకాశం ఉందని తెలిపారు నీటి ఆధారంగానే పాల కల్తీకి సంబంధించి స్పష్టత వస్తుందని భావిస్తున్నామని తెలిపారు.

**ఏడుగురి పరిస్థితి ఆందోళనకరం**

రాజమహేంద్రవరం ఘటనకు సంబంధించి ఇప్పటివరకు నలుగురు మరణించారని తెలిపారు ప్రస్తుతం 15 మంది పలు అసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు వీరిలో ముగ్గురు వెంటిలేటర్లు, ఇద్దరు డయాలసిస్, మరో ముగ్గురు వెంటిలేటర్-డయాలసిస్పై ఉన్నారని వీరపాండియన్, నీలకంఠారెడ్డి వివరించారు. మొత్తం ఏడుగురి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు చికిత్స పొందుతున్న వారిలో ఐదునెలల పాపతోపాటు ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారని తెలిపారు.

**చెన్నై, ముంబయి నుంచి ప్రత్యేక మందుల రాక**

బాధితుల ఆరోగ్య పరిస్థితిని సీనియర్ నెఫ్రాలిజిస్ట్ రవిరాజ్ సూచనల మేరకు కిడ్నీల పనితీరు త్వరగా మెరుగుపడేందుకు వీలుగా ఇక్కడ అందుబాటులో లేని మందులను చెన్నై, ముంబయి నుంచి తెప్పిస్తున్నామని తెలిపారు వీటితో వెంటనే బాధితులకు చికిత్స అందిస్తామని వెల్లడించారు. ఈ నెల 16న ఇళ్లకు పాల సరఫరా జరిగిందని కొందరిలో ఆలస్యంగా లక్షణాలు బయటపడే అవకాశం ఉందని తెలిపారు దీనివల్ల 24 గంటలపాటు వైద్యులను సదరు ప్రాంతాల్లో అందుబాటులో ఉంచామని చెప్పారు. మరో నెల వరకు ఈ చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.

**రక్త పరీక్షల ఫలితాలకు అనుగుణంగా ముగ్గుర్ని ఆసుపత్రుల్లో చేర్పించాం**

రక్త పరీక్షల ద్వారా క్రియాటిన్ స్థాయి ఎక్కువగా ఉన్న వారిలో ఇద్దరిని గుర్తించి ఆసుపత్రుల్లో చేర్పించామని అధికారులు వివరించారు. వ్యాపారి దగ్గర పాలు కొనుగోలుచేసి, 110 కుటుంబాలకు చెందిన 315 మంది రక్తనమూనాలు సేకరించామన్నారు వీరిలో ఇద్దరికి క్రియాటినిన్ సాయి ఎక్కువగా ఉండడం, మరొకరిలో అనుమానిత లక్షణాలు కనిపించడంతో ముగ్గురిని చికిత్స నిమిత్తం ఆసుపత్రుల్లో చేర్పించామన్నారు. వీరి ఆరోగ్య పరిస్తితి నిలకడగా ఉందని వెల్లడించారు.

**కొనసాగుతున్న పోలీసుల విచారణ**

రాజమహేంద్రవరం ఘటనకు సంబంధించి పోలీసులు అదుపులో ఉన్న వ్యక్తి నుంచి సేకరించిన సమాచారం ప్రకారం డెయిరీ పాల నిల్వల విషయంలో కూలెంటుగా వాడిన ఇథలిన్ గైకాల్, ఇతర అంశాల గురించి విచారణ సాగుతుందని పేర్కొన్నారు. పాల శీతలీకరణ యంత్రానికి మరమ్మతులు చేసిన మెకానిక్ను సైతం పోలీసులు విచారించారని, అది మరమ్మతుకు గురైతే తాను సరిచేశానని తెలిపారు. పోలీసులు ఇంకా తీవ్ర స్థాయిలో విచారణ జరుపుతున్నారని పేర్కొన్నారు.

**పాల విక్రయ, నిల్వ కేంద్రాల్లో తనిఖీలు**

రాష్ట్ర వ్యాప్తంగా పాల వర్తకులు, పాల తయారీదారులు, నిల్వదారులు, హోల్సేల్ వర్తకుల నుంచి నమూనాల సేకరణ బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఐపీఎం డైరెక్టర్ నీలకంఠారెడ్డి వెల్లడించారు వారివద్ద ఆధీకృత లైసెన్సులు ఉన్నాయా? లేవా అన్న వాటిపై తనిఖీల్లో గుర్తించనున్నామని తెలిపారు

# తాళాలు వేశారు

అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వైసీపీ హయాంలో పశుసంవర్ధక శాఖలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, రైతులు, పశుపాలకులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కూడా అందించలేని దుస్థితి ఏర్పడిందని మంత్రి తెలిపారు. పశువుల చికిత్సకు అవసరమైన మందులు లేవు, ఆధునిక పరికరాలు లేవు, ఉన్న భవనాలు శిథిలావస్థలో ఉండగా, వాటిని చూసుకునే సిబ్బంది కూడా లేకుండా శాఖను నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో పశుసంవర్ధక శాఖ ద్వారా మొత్తం 3176 కేంద్రాలు పనిచేస్తున్నప్పటికీ, గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వీటిలో చాలా కేంద్రాలు పేరుకే పరిమితమయ్యాయని మంత్రి పేర్కొన్నారు. రైతుల విరాళాలతో నిర్మించిన పాత భవనాలను కూడా సంరక్షించలేక, వాటిని శిథిలావస్థకు నెట్టారని ఆరోపించారు. వైసీపీ పాలనలో ఐదేళ్ల పాటు పశుసంవర్ధక శాఖకు నిధులు కేటాయించకుండా, మౌలిక సదుపాయాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, ఫలితంగా పశువైద్యశాలలు మందుల్లేక, సిబ్బంది లేక, రైతులకు ఉపయోగపడని పరిస్థితిలోకి వెళ్లాయని మంత్రి అన్నారు.

# శశికళ కొత్త పార్టీ

నూతన పార్టీకి సంబంధించిన జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత చూపిన మార్గంలో తమ పార్టీ పయనిస్తుందన్నారు. పేదలు, అణగారిన వర్గాలు, సామాన్య ప్రజల కోసమే పనిచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జయలలిత మరణాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.

# కేరళ పేరు.. ఇక కేరళం

పరిగణనలోకి తీసుకుంది. ఈ ఏడాది కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కేరళ పేరు మార్పుపై తొలిసారి 2023లో రాష్ట్ర అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించింది. తమ రాష్ట్రం పేరును పూర్వం నుంచే మలయాళంలో 'కేరళం' అని పిలిచేవారని అప్పట్లో ముఖ్యమంత్రి పినరయి విజయన్ గుర్తు చేశారు. కానీ, ఇతర భాషల్లో మాత్రం కేరళ అని పిలుస్తున్నారని ఆయన తెలిపారు. కాగా.. ఈ విషయంలో విజయన్ (ౡఊఅఖుతీఖుఎఊ ఎఊయిఖుఖుఅ) ప్రభుత్వానికి భాజపా మద్దతు ఇచ్చింది. ఈ మేరకు ఇటీవల ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ సీఎంకు లేఖ రాశారు. దానికి ముఖ్యమంత్రి బదులిస్తూ.. "రాష్ట్రం అసలు పేరు కేరళం. కానీ బ్రిటిషర్లు తమ సౌకర్యం కోసం కేరళగా మార్చారు. వారు చేసిన మార్పులను రాష్ట్ర సంస్కృతికి అనుగుణంగా సరిదిద్దుతున్నాం" అని పేర్కొన్నారు.

# నేను ఎంతకాలం ఉంటానో తెలియదు

తన నివాసంలోకి ఓ సాయుధ దుండగుడు చొరబడిన ఘటనపై స్పందిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. శనివారం అర్ధరాత్రి సమయంలో ఓ దుండగుడు ఫ్లోరిడాలోని ట్రంప్ నివాసంలోకి ప్రవేశించాడు. అతడి చేతిలో ఆయుధంతోపాటు ఇంధనం క్యాన్ ఉన్నట్లు సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు గుర్తించారు. వాటిని కిందపడేయాలని హెచ్చరించినా ఆ దుండగుడు వినకపోవడంతో భద్రతా సిబ్బంది అతడిని హతమార్చారు. కాగా.. ట్రంప్‌పై గతంలోనూ పలుమార్లు హత్యాయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. 2024 జులైలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయనపై ఓ వ్యక్తి కాల్పులు జరిపాడు. ఆ ఘటనలో ట్రంప్ చెవి భాగం నుంచి తూటా దూసుకెళ్లింది. ఆ తర్వాత ఓసారి ట్రంప్ పామ్ బీచ్ గోల్ఫ్ కోర్స్‌లో రైఫిల్‌తో అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తినీ పోలీసులు అరెస్టు చేశారు

# మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ

అమరవీరుల సంస్మరణ సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఎంతో మంది మావోయిస్టులు అజ్ఞాతాన్ని వీడి జన జీవన స్రవంతిలోకి వస్తున్నారు. అలా వచ్చిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రివార్డులు, పునరావాస ప్రయోజనాలు వెంటనే అందిస్తాం" "మావోయిస్టుల లొంగుబాటులో కీలకంగా వ్యవహరించిన స్పెషల్ ఇంటెలిజెన్స్ ఐజీ సుమతి, ఆమె టీమ్‌నకు నా అభినందనలు. ఐడీజీ ఇంటెలిజెన్స్ విజయ్‌కుమార్‌ను కూడా అభినందిస్తున్నా" అని తెలిపారు. ఈ సందర్భంగా దేవ్‌జీ, బడే చొక్కారావు, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డిల స్వస్థలం, విద్యాభ్యాసం, మావోయిస్టులుగా వారి ప్రయాణాన్ని డీజీపీ వివరించారు. జన జీవన స్రవంతిలోకి వచ్చిన మావోయిస్టుల హక్కుల కాపాడేందుకు ప్రయత్నిస్తామని అవసరమైతే వారి ప్రాణాలకు తమ ప్రాణాలు అడ్డు వేస్తామని డీజీపీ పునరుద్ఘాటించారు.

**లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస ప్రయోజనాలివే!**

తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం...

తిపిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ: సెంట్రల్ కమిటీ సభ్యుడు (జజవీ) పొలిట్‌బ్యూరో సభ్యుడు (ౡదీవీ)పై రూ. 25,00,000/- (ఇరవై ఐదు లక్షలు) నగదు బహుమతి.

మల్ల రాజి రెడ్డి ఎలియాస్ సంగ్రామ్: సెంట్రల్ కమిటీ సభ్యుడు (జజవీ)పై రూ.25,00,000/- (ఇరవై ఐదు లక్షలు) నగదు బహుమతి.

బడే చొక్కా రావు ఎలియాస్ దామోదర్: స్టేట్ కమిటీ సభ్యుడు (ూజవీ)పై రూ.20,00,000/- (ఇరవై లక్షలు) నగదు బహుమతి.

నూనె నర్సింహ రెడ్డి ఎలియాస్ గంగన్న: స్టేట్ కమిటీ సభ్యుడు (ూజవీ)పై రూ.20,00,000/- (ఇరవై లక్షలు) నగదు బహుమతి.

రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాల పునరావాస పథకం ప్రకారం, వీరికి లభించే మొత్తం రూ. 90,00,000/-(తొంబై లక్షలు) నగదు బహుమతిని డిమాండ్ డ్రాఫ్ట్/చెక్కుల రూపంలో చెల్లించనున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ, తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం వీరికి లభించాల్సిన అన్ని ప్రయోజనాలను తక్షణమే అందిస్తారు. "మేము ప్రజల సమస్యలపై ప్రజల తరఫున ప్రజలతో కలిసి పనిచేస్తాం. పార్లమెంటరీ వ్యవస్థలోకి పోవాలనేది మా ఉద్దేశం కాదు. ప్రజల సమస్యలపై జరిగే పోరాటాలను సంఘటితం చేయడం కోసం చట్ట పరిధిలో పనిచేయాలని ఆలోచించాం. అవకాశం ఉన్నప్పుడల్లా ప్రజల పోరాటాల వెనుక నిలబడతామని హామీ ఇస్తున్నాం. మావోయిజం ఎప్పటికీ ముగిసిపోదు. ప్రపంచవ్యాప్తంగా అది అభివృద్ధి చెందుతూనే ఉంటుంది" -మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్

శ్రీకాకుళంలో డయేరియా అంశంపై

# సీఎం చంద్రబాబు సమీక్ష

సీఎంకు తెలిపారు. ఈ ఘటనలో మొత్తంగా 65 మంది వివిధ ఆస్పత్రుల్లో చేరారని వివరించారు. ఎనిమిది మంది ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని...ప్రస్తుతం వివిధ ఆసుపత్రుల్లో మొత్తం 55 మంది చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు. శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రిలో 30 మంది, జిజిహెచ్ లో 11 మంది, జెమ్స్ లో 6 మంది, యుపిహెచ్‌సిలో నలుగురు, మెడికవర్‌లో ఒకరు, ఇతర ప్రైవేట్ ఆసుపత్రుల్లో ముగ్గురు బాధితులు చికిత్స పొందుతున్నట్టు వెల్లడించారు. జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని, ప్రస్తుతం వారికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మిగిలిన 53 మంది బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉందని, వారు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని వివరించారు. డయేరియా ప్రభావంపై నగరంలో జరుగుతున్న క్షేత్రస్థాయి సర్వే గురించి సీఎం చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సర్వేలో భాగంగా డయేరియా లక్షణాలు ఉన్న మరో 79 మందిని గుర్తించామని, అయితే వారి పరిస్థితి ఆందోళనకరంగా లేదని... ఆసుపత్రిలో చేర్చాల్సిన అవసరం లేదని డాక్టర్లు తెలిపినట్టు వివరించారు. వారికి అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఇంటి వద్దే అందజేస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బాధితులందరికీ అత్యుత్తమ వైద్యం అందేలా చూడాలని, ముఖ్యంగా వెంటిలేటర్‌పై ఉన్న ఇద్దరి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం ఆదేశించారు. వ్యాధి మరింత ప్రబలకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తాగునీటి కాలుష్యం జరగకుండా క్లోరినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, మురుగునీటి కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలు భయాందోళనకు గురికాకుండా అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి బాధితులకు ధైర్యం చెప్పాలని సీఎం అధికారులను ఆదేశించారు.

# ఎడిటర్ వాయిస్

## పాలు కల్తీకి కారణమేంటి? దర్యాప్తులో సంచలన విషయాలు!

రాజమహేంద్రవరంలో కల్తీ పాలు ఘటనపై సంచలన సమాచారం బయటకు వస్తోంది. అమృతం లాంటి పాలు విషంగా మారడానికి కారణాలు ఏంటన్న కోణంలో పోలీసులు, వైద్యాధికారులు లోతుగా విచారణ జరుపుతున్నారు. ఘటనకు కారణమైన వరలక్ష్మి డెయిరీ యజమాని గణేష్ ను రాజమండ్రి పోలీసుస్టేషన్ లో విచారించారు. ఈ నెల 15 రాత్రి ఏం జరిగింది? 16న పాలు సరఫరా చేసిన తర్వాత వాటిన సేవించిన వారు ఎందుకు అనారోగ్యానికి గురయ్యారన్న అంశాలపై అధికారులు ఫోకస్ చేశారు. నిందితుడు ఇచ్చిన సమాచారం, బాధితుల రక్త నమూనాల్లో లభించిన సమాచారం ప్రకారం ఘటనపై ఓ నిర్ధారణకు వచ్చారని చెబుతున్నారు.

రాజమహేంద్రవరం ఘటనకు పాలు కల్తీ జరగడమే కారణమని అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. అయితే ఈ కల్తీ ఉద్దేశపూర్వకంగా జరిగిందా? లేక ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? ప్రమాదవశాత్తూ పాలులో ఏమైనా కలిసిందా? అనేది తెలుసుకుంటున్నారని చెబుతున్నారు. విశాఖ ల్యాబ్ నుంచి పాలు కల్తీపై ఈ రోజు సాయంత్రానికి నివేదిక వస్తుందని అంటున్నారు. అయితే నిందితుడు గణేష్ ను విచారించిన సమయంలో ఇచ్చిన సమాచారం పాలు కల్తీకి కారణం కావొచ్చని అధికారులు భావిస్తున్నారు. పాలును నిల్వ చేసిన ఫ్రిడ్జిలో కూలెంట్ ఆయిల్ లీకైన మరునాడు ఘటన జరిగినట్లు నిందితుడు గణేష్ అధికారుల విచారణలో వెల్లడించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నెల 15 వరలక్ష్మి డెయిరీలోని శీతలీకరణ కేంద్రంలో కూలెంట్ లీకై ఓ క్యాన్ లో కలిసినట్లు నిందితుడు పోలీసులకు తెలిపాడు. ప్రతిరోజూ తాను మూడు క్యానులలో పాలను సేకరిస్తానని గణేష్ పోలీసులకు తెలిపాడు. ఈ నెల 15న రాత్రి కూలెంట్ ఆయిల్ లీకై ఉండొచ్చని, అది గుర్తించకుండా మరునాడు అతడు పాలను సరఫరా చేసినట్లు భావిస్తున్నారు. మూడు క్యానుల్లో పాలు ఉండగా, ఒక దాంట్లో కూలెంట్ ఆయిల్ కలిసినట్లు అనుమానిస్తున్నారు. ఈ పాలను సేవించిన వారు అస్వస్థతకు గురై ఉండొచ్చని అంటున్నారు. కూలెంట్ లీకైన విషయాన్ని 17వ తేదీన తాను గుర్తించినట్లు నిందితుడు గణేష్ తెలిపాడని అంటున్నారు. అయితే శీతలీకరణ కేంద్రంలో కూలెంట్ గా వాడుతున్న ఇథలీన్ గ్లైకాల్ కారణంగానే ఈ దుష్పరిమాణం సంభవించినట్లు అనుమానిస్తున్నారు. ఇథలీన్ గ్లైకాల్ ను కార్లు, ట్రక్కులు, హెచ్.వీ.ఏ.సీ సిస్టమ్స్, పరిశ్రమల్లోని చిల్లర్ లలో వినియోగిస్తారు. డీ-ఐసింగ్ ద్రవాలు, బ్రేక్ ఫ్లూయిడ్, పెయింట్స్, ప్లాస్టిక్, పాలిస్టర్ ఫైబర్లలోనూ దీనిని వాడతారని చెబుతున్నారు. కానీ, ఆహారంగా తీసుకునే డెయిరీ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల్లో ఇథలీన్ గ్లైకాల్ ను ఎట్టిపరిస్థితుల్లోనూ వాడకూడదని అంటున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఫుడ్ గ్రేడ్ ప్రొపైలీన్ గ్లైకాల్ ను వినియోగిస్తారని చెబుతున్నారు. అయితే ఖర్చు తక్కువ అనే ఉద్దేశంతో కొన్ని డెయిరీల నిర్వాహకులు ప్రొపైలీన్ గ్లైకాల్ కి బదులుగా ఇథలీన్ గ్లైకాల్ ను వాడుతుంటారని ఫుడ్ సేఫ్టీ అధికారులు చెబుతున్నారు. వరలక్ష్మీ డెయిరీలోనూ కూలెంట్ గా ఇథలీన్ గ్లైకాల్ వాడటం వల్లే పాలు విషంగా మారాయని అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు చెబుతున్నారు.

ఇథలీన్ గ్లైకాల్ అత్యంత ప్రమాదకర రసాయనమని అధికారులు వివరిస్తున్నారు. 100 నుంచి 200 మిల్లీ లీటర్ల పరిణామంలో మనిషి శరీరంలోకి ఇది చేరితే ప్రాణాంతకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇథలీన్ గ్లైకాల్ ప్రభావం మూడు దశల్లో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇథలీన్ గ్లైకాల్ కలిసిన పదార్థాలు తీసుకున్న 30 నిమిషాల నుంచి 12 గంటల వరకు మత్తుగా ఉంటుందని, తలనొప్పి వికారం వాంతులు నిద్రమత్తు వంటి లక్షణాలు కనిపిస్తాయని అంటున్నారు. అదేవిధంగా 12 గంటల తర్వాత మెటబాలిక్ యాసిడోసిస్, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గుండె దడ, రక్తపోటు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయని చెబుతున్నారు. ఇక మూడో దశలో ఒక రోజు తర్వాత మూత్ర



పిండాలు దెబ్బతిని మూత్ర రావడం నిలిచిపోతుందని వివరిస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఇవే లక్షణాలతో ఐదుగురు మరణించినట్లు అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. పాలు చేదుగా ఉన్నాయని బాధితులు ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా దర్యాప్తు జరిపిన అధికారులు వరలక్ష్మీ డెయిరీలో తనిఖీలు చేయగా, ఇథలీన్ గ్లైకాల్ లీకైన విషయాన్ని గుర్తించినట్లు తెలుస్తోంది.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## ఏటీఎం కార్డులు మార్చి.. డబ్బు కాజేసి

**వృద్ధులు, మహిళలను మోసం చేస్తున్న యువకుడి అరెస్టు**
**తెలుగు రాష్ట్రాల్లో నిందితుడిపై 20 కేసులు**
**పోలీసులు స్వాధీనం చేసుకున్న ఏటీఎం కార్డులు, నగదు**



**నర్సీపట్నం అర్బన్, విశ్వం వాయిస్ న్యూస్ :** వృద్ధులు, మహిళలను లక్ష్యంగా చేసుకుని ఏటీఎం సెంటర్ల వద్ద కార్డులు మారుస్తూ నగదు అపహరిస్తున్న యువకుడిని అనకాపల్లి జిల్లా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా పర్చూరు మండలం వీరన్నపాలేనికి చెందిన మొవ్వ వీరయ్యచౌదరి(34) విశాఖపట్నంలో నివసిస్తున్నాడు. గత నెల 17న నర్సీపట్నం మండలం ధర్మసాగరానికి చెందిన నూకరాజు నర్సీపట్నంలోని డీబీఆర్ షాపింగ్‌మాల్ వద్ద ఏటీఎంలో నగదు తీసుకోవడానికి వచ్చారు. ఆ సమయంలో అక్కడే ఉన్న వీరయ్య సహాయం చేస్తానని చెప్పడంతో నమ్మి ఏటీఎం కార్డు ఇచ్చారు. నగదు తీయడానికి పిన్ నంబర్ కూడా చెప్పారు. మూడుసార్లు కార్డు పెట్టి తీసి నగదు రావడం లేదని చెప్పిన వీరయ్య.. ఓ కార్డు అతడి చేతిలో పెట్టి వెళ్లిపోయాడు. మర్నాడు మరో ఏటీఎంకు వెళ్లిన నూకరాజు కార్డు పెట్టి చూసినా ఫలితం లేకపోవడంతో బ్యాంక్‌కు వెళ్లారు. ఏటీఎం కార్డు మారిపోయిందని బ్యాంక్ సిబ్బంది చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించారు. అప్పటికే గుర్తుతెలియని వ్యక్తి ఒరిజినల్ కార్డును ఉపయోగించి రూ.15వేలు డ్రా చేశారని తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు సీసీకెమెరా ఫుటేజ్ పరిశీలించి నర్సీపట్నంలో వీరయ్యను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.10వేల నగదు, తొమ్మిది ఏటీఎం కార్డులు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. 2017 నుంచి ఇప్పటివరకు వీరయ్యపై ఇలాగే రెండు తెలుగు రాష్ట్రాల్లో 20 కేసులు నమోదయ్యాయని డీఎస్పీ వెల్లడించారు.

## ఆర్టీసీ బస్సు బోల్తా... 12 మందికి తీవ్రగాయాలు



**ఉట్నూరు గ్రామీణం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం శ్యాంపూర్ సమీపంలో వంతెన వద్ద ఆసిఫాబాద్ డిపో ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. సోమవారం ఉదయం ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్తున్న బస్సు శ్యాంపూర్ వాగుపైనున్న ఇరుకు వంతెన సమీపంలోకి రాగానే ఎదురుగా బొలెరో వాహనం దూసుకొచ్చింది. దాన్ని తప్పించబోయి వర్షం, మంచు కారణంగా బస్సు నియంత్రణ తప్పి పక్కనే ఉన్న వాగులో పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, కండక్టర్లతోపాటు 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విచారం వ్యక్తంచేశారు. ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో మాట్లాడి సంబంధిత వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారికి నాణ్యమైన వైద్యం అందించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సైతం ప్రమాద ఘటనపై ఆరా తీసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

## నిలువునా ముంచిన ఫ్రెండ్..

**యువతి ఖాతాలో రూ.7 కోట్లు ఖాళీ**

**బెంగళూరు (బాణసవాడి), విశ్వం వాయిస్ న్యూస్ :** ఆమె నమ్మకాన్ని ఆ స్నేహితుడు వమ్ముచేశాడు. ఏకంగా రూ.7 కోట్లకు టోపీ పెట్టాడు. స్నేహితుడిని నమ్మి బ్యాంకుఖాతా వివరాలు ఇస్తే.. ఆ వివరాలను రూ.7 కోట్లను ఖాతా నుంచి ఖాళీచేసిన ఘటన బెంగళూరులో కలకలం రేపింది. బాధితురాలు ఓ సంపన్న కుటుంబానికి చెందిన విద్యార్థిని. నగర ఉత్తర విభాగం సైబర్ క్రైమ్ పోలీసు ఠాణాలో ఆమె చేసిన ఫిర్యాదు ప్రకారం.. ఏడాది కిందట ఆయుష్ అనే విద్యార్థి ఆమెకు పరిచయమయ్యాడు. 'అనుకోకుండా ఏదో సాంకేతిక సమస్య ఎదురైంది. నా బ్యాంకు ఖాతాను అధికారులు స్తంభింపచేశారు. కొన్ని లావాదేవీలు చేసుకోవడానికి నీ బ్యాంకు ఖాతా వివరాలు కాస్త చెబుతావా' అంటూ నమ్మబలికాడు. అతడిని అప్పటికే బాగా విశ్వసించిన ఆమె పాస్‌బుక్, చెక్‌బుక్, ఏటీఎం కార్డులను అప్పగించింది. వాటి సాయంతో చేయాల్సినదంతా చేసేశాడని గుర్తించడానికి ఆమెకు ఎక్కువ రోజులు పట్టలేదు. ఆమె మేలుకునేలోపే బ్యాంకు అధికారులు అప్రమత్తమయ్యారు. 'మీ ఖాతా నుంచి ఇంత సొమ్ము మీకు తెలిసే ఖాళీ అవుతోందా' అని ప్రశ్నించడంతో విద్యార్థిని కాళ్ల కింద భూమి కదిలినంత పనైంది. వెంటనే ఖాతాలను స్తంభింపజేశారు. మోసగాడి కోసం గాలిస్తున్నారు.

**ఫేస్‌బుక్ పోస్టులు.. అనంతపురంలో**

## కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య

**అనంతపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అనంతపురంలో విషాదం చోటుచేసుకుంది. ఫేస్‌బుక్ పోస్టులతో మనస్తాపానికి గురైన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. కానిస్టేబుల్ భార్య ఫేస్‌బుక్‌లో ఇటీవల కొన్ని పోస్టులు చేశారు. ఆమె పోస్టుల కింద మరో కానిస్టేబుల్ గురు మోహన్‌రెడ్డి అసభ్య మెసేజ్‌లు పెట్టాడు. వీటిని భర్త చూడడంతో దంపతుల మధ్య రెండు రోజుల క్రితం గొడవ జరిగింది. గురుమోహన్‌రెడ్డిపై పీఎస్‌లో భార్యతో కానిస్టేబుల్ ఫిర్యాదు చేయించారు. ఈ క్రమంలోనే ఆమె ఇంట్లో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది.

**హైదరాబాద్ పోలీసుల**

## భారీ ఆపరేషన్..

**104 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్**

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** 'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. మొత్తం 16 రాష్ట్రాల్లోని 104 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు. నిందితుల్లో బ్యాంకు అధికారులు కూడా ఉన్నారు. 32 బృందాలతో 16 రాష్ట్రాల్లో 10 రోజుల పాటు ఈ ఆపరేషన్ కొనసాగింది. నిందితులపై దేశవ్యాప్తంగా 1,055 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటి వరకు వీరు పలు సైబర్ నేరాల్లో రూ.127 కోట్లకు పైగా మోసాలకు పాల్పడినట్లు నిర్ధారించారు. వారి నుంచి రూ.36 లక్షల నగదుతో పాటు 204 మొబైల్ ఫోన్లు, 141 సిమ్‌కార్డులు, 152 బ్యాంక్ పాస్‌బుక్‌లు, 234 డెబిట్ కార్డులు, 26 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు.

## కన్నతల్లి కర్కశం..

**పసిబిడ్డను కట్టెల పొయ్యిలో వేసి..**

**కుత్బుల్లాపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. కన్నబిడ్డను కట్టెల పొయ్యిలో వేసి చంపేసిందో కసాయి తల్లి. బౌరంపేటలో రెండు నెలల బాలుడిని కన్నతల్లే దారుణంగా హింసించి చంపిన ఘటన తీవ్ర విషాదం రేపింది. నిన్న రాత్రి నుంచి ఏడుస్తున్నాడని బాలుడి నోట్లో గుడ్డలు కుక్కి.. కాళ్లు, చేతులు కట్టేసి పొయ్యిలో వేసి కిరాతకానికి ఒడిగట్టింది. బాలుడు చనిపోవడంతో కన్నీటి పర్యంతమైన తండ్రి.. ఆమెతో గొడవకు దిగాడు. దంపతుల మధ్య వివాదం గురించి స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం బయటకు వచ్చినట్లు సమాచారం. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బిహార్‌కు చెందిన ఈ కుటుంబం బౌరంపేటలోని ఓ కన్‌స్ట్రక్షన్ సైట్ వద్ద పనిచేస్తున్నట్లు సమాచారం.

## హైదరాబాద్‌లో విషాదం..

**ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి**

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని అంబర్‌పేటలో విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతులను భర్త రామరాజు (55), ఆయన భార్య మాధవి (50), కుమారుడు శశాంక్ (24)గా గుర్తించారు. తొలుత మాధవిని రామరాజు, శశాంక్ ఊపిరాడకుండా చేసి చంపేశారు. అనంతరం వారిద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. హోటల్ వ్యాపారంలో నష్టం, అప్పుల వారి వేధింపులతో ఈ ఘటన జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

## టాప్ స్కోరుకు స్మార్ట్ రైటింగ్






పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయి. వీటికోసం బాగా చదవడం ఒక ఎత్తయితే నేర్చుకున్న అంశాలను పరీక్షాపత్రంలో ఎలా ప్రదర్శించామన్నది మార్కులను నిర్ణయిస్తుంది. మీ జవాబు పత్రం మూల్యాంకనం చేసే వారిని మెప్పించాలి. ఇందుకోసం కొన్ని మెలకువలు పాటించాలి. దీంతో ఆశించిన మార్కులు సొంతమవుతాయి.

**తెలిసిన ప్రశ్నలతోనే బోణీ?**

పరీక్షా పత్రం చేతికి రాగానే కంగారు పడకూడదు. ఎలాంటి నిబంధనలూ లేకపోతే మీకు బాగా తెలిసిన ప్రశ్నతోనే సమాధానాలు రాయడం ప్రారంభించండి. దీనివల్ల మీలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, సమయమూ ఆదా అవుతుంది. అలాగే మీ పేపర్ మూల్యాంకనం చేసేవారికి మీపై మంచి అభిప్రాయం ఏర్పడుతుంది.

**సూటిగా, సుత్తి లేకుండా**

అనవసరమైన పొడవాటి సమాధానాలు, పేరాగ్రాఫ్‌లు రాయొద్దు. దిద్దేవారు అయోమయానికి గురికాకూడదు. జవాబును సూటిగా, పాయింట్ల వారీగా రాయండి. ప్రశ్నలో అడిగిన దానికి తగినట్లుగా సమాధానం ఉండాలి. మార్కుల వెయిటేజీని (2, 3, 5, 10 మార్కులు) బట్టి మీ సమాధానం నిడివిని సరిచూసుకోండి. లఘు ప్రశ్నలకు వ్యాసరూపంలో సమాధానం రాస్తే సమయం వృథా తప్ప, ప్రయోజనం ఉండదు. వాక్యాలు దీర్ఘంగా వద్దు. తక్కువ పదాలతో పొందికగా రాయాలి.

**కీ వర్డ్స్ ముఖ్యం**

జవాబులో ముఖ్యమైన పదాలు (కీవర్డ్స్), తేదీలు, సూత్రాలు లేదా శీర్షికల కింద పెన్సిల్‌తో గీత గీయండి. దీంతో మీరు చెప్పాలనుకున్న ప్రధానాంశం తేలికగా అర్థమవుతుంది. సరైన పదజాలం ఉపయోగిస్తే పూర్తి మార్కులకూ అవకాశం ఉంది. అక్షర దోషాలు లేకుండా చూసుకోవాలి. ముఖ్యంగా భాషల పేపర్లు రాసేటప్పుడు ఈ విషయంలో మరింత జాగ్రత్త వహించాలి. ప్రతి సబ్జెక్టులోనూ నిర్దేశిత బ్లూ ప్రింట్ ప్రకారం మీ సమాధానాలు ఉంటే పూర్తి మార్కులు తెచ్చుకోవచ్చు.

**బుల్లెట్ పాయింట్లు, హెడ్డింగులు!**

పెద్ద పెద్ద సమాధానాలను పేరాగ్రాఫ్ రూపంలో కాకుండా, చిన్న చిన్న సబ్-హెడ్డింగులు, బుల్లెట్ పాయింట్లుగా విభజించండి. సమాచారాన్ని ఇలా అమర్చడం వల్ల మీ పేపర్ చూసేందుకు స్పష్టంగా, ఒక పద్ధతిగా ఉన్నట్లు కనిపిస్తుంది.


**బొమ్మలు తప్పనిసరి**

సైన్స్, జాగ్రఫీ, ఎకనామిక్స్ లాంటి సబ్జెక్టుల్లో వీలైన చోటల్లా చిత్రపటాలు గీయండి. బొమ్మలను పెన్సిల్‌తోనే గీసి భాగాలను స్పష్టంగా గుర్తించాలి. కచ్చితత్వంతో, ఆకర్షణీయంగా ఉండే డయాగ్రామ్స్ పూర్తి మార్కులు పొందేలా చేస్తాయి.

**ఖాళీ వదలండి**

జవాబు పత్రం గందరగోళంగా ఉండకూడదు. సమాధానాల మధ్య కొంచెం ఖాళీ వదలండి. బాగా కుదించి రాయొద్దు. సరైన సమాధానాన్ని సులువుగా అర్థమయ్యేలా రాస్తే ఆ ప్రశ్నలకు కేటాయించిన పూర్తి మార్కులు మీ సొంతమవుతాయి. పరీక్ష ముగియడానికి 10 నిమిషాల ముందే ప్రశ్నాపత్రం పూర్తయ్యేలా చూసుకోండి. చివరలో.. రోల్ నంబర్ సరిగా రాశారో లేదో చూసుకోండి. ఏవైనా అక్షరదోషాలుంటే సరిదిద్దండి. పక్కనే ఆ పదాన్ని అర్థమయ్యేలా రాయండి. తెలియక వదిలేసిన ప్రశ్నలు ఏవైనా ఉంటే పూర్తి చేయడానికి ప్రయత్నించండి. ప్రశ్న సంఖ్య, సెక్షన్ మొదలైనవి సరిగా రాశారో లేదో పరిశీలించుకోండి.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...


కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ
బుధవారం, 25 ఫిబ్రవరి 2026



www.viswamvoice.com

# ఘటన దురదృష్టకరం.. బాధాకరం

- మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్ గ్రేషియా - బాధితులకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది
- ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు - రిపోర్టు వచ్చాక కఠిన చర్యలు ఉంటాయి
- ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రుడా ఛైర్మన్ బొడ్డు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** చౌడేశ్వరనగర్లో అనురియా, మూత్రపిండాలు ఫెయిల్ అవ్వడం వలన బాధితులు వివిధ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, అయితే అనూరియా కేసులపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. కల్తీ పాల ఘటనకు సంబంధించి నలుగురు వృద్ధులు మరణించడం దురదృష్టకరం, చాలా బాధాకరం అని ఆయన పేర్కొన్నారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. బొల్లినేని, రెయిన్ బో ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నవారిని రుడా ఛైర్మన్, జిల్లా టిడిపి అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణ చౌదరితో కల్సి ఎమ్మెల్యే వాసు పరామర్శించారు. బాధిత కుటుంబాలను, వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా చౌడేశ్వరి నగర్లో కూటమి



నాయకులతో కలిసి ఏర్పాటు మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు యుద్ధప్రాతిపదికన ప్రభుత్వం 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు చెప్పారు. ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న బాధితులకు వైద్య పరంగా అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఎంత ఖర్చు అయినా భరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రెయిన్బో హాస్పిటల్ అత్యున్నత సాంకేతికత అందించేందుకు విజయవాడ నుండి ఎక్విప్మెంట్ తీసుకువచ్చారని ఆయన తెలిపారు. బాధితులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య బృందాలను నియమించి, పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని ఆయన చెప్పారు. వరలక్ష్మి మిల్క్ డైరీ ద్వారా పాలు సరఫరా చేసినట్లు తెలుస్తోందని, ఇప్పటికే పాలవ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని వివరాలు సేకరి స్తున్నారని ఆయన వివరించారు. సమస్య మొదలైన 24 గంటల్లోనే ప్రభుత్వం టీం అంతా ఫీల్డ్‌లో ఉండి పర్యవేక్షణ చేస్తోందని ఎమ్మెల్యే వాసు చెప్పారు. పాలు ఎవరెవరు కొన్నారో తెల్సుకుని వారందరికీ బ్లడ్ శాంపిల్స్ తీస్తున్నారని, ఇప్పటికే 73 మందికి బ్లడ్ శాంపిల్స్ తీసుకు న్నారని ఎమ్మెల్యే వాసు తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నారని, ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్యే వాసు స్పష్టంచేసారు. ఎప్పటికప్పుడు ఆరోగ్యమంత్రి సత్యకుమార్, మంత్రి లోకేష్ ప్రత్యేక శ్రద్ధతో సమీక్ష చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. ఒకవేళ ఎవరికైనా ఇబ్బందికర పరిస్థితి ఉంటే వెంటనే సంప్రదించాలని సూచించారు. బొడ్డు వెంకట రమణ చౌదరి మాట్లాడుతూ కల్తీ చేసిన వారిని ఎవ్వరిని ఉపేక్షించేది లేదని, లాబ్ రిపోర్ట్ వచ్చేంత వరకు ఏమి కలిసిందో చెప్పలేమని అన్నారు. రిపోర్ట్ రెండు రోజుల్లో వస్తుందని, దాన్ని బట్టి అప్పుడు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. కల్తీ చేయాలంటే భయపడేవిధంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అందులో ఎలాంటి సందేహం అక్కర్లేదని ఆయన స్పష్టంచేసారు. మీడియా సమావేశంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ వర్కర్స్‌కు
# కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

### ఐసిడిఎస్ ఆఫీసు ఎదుట రిలే నిరాహార దీక్షలు



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కోరుకొండ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ఎం. మాలతి,సి. హెచ్చ. అన్నపూర్ణ ఆధ్వర్యంలో కోరుకొండలోని ఐసిడిఎస్ ఆఫీసు ఎదుట రిలే నిరాహారదీక్ష ప్రారంభించారు. ఈ శిబిరాన్ని ఉద్దేశించి సిఐటియు తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి బి.వి.ఎన్.పూర్ణిమ రాజు మాట్లాడుతూ అంగన్వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని నిరాహారదీక్ష చేస్తున్నవారిని అభినందించారు. ఈనెల 25,26,27న మూడు రోజులు తూర్పుగోదావరి జిల్లా సబ్ కలెక్టర్ ఆఫీసు వద్ద ధర్నా జరుగుతుందని, కార్మికులకు ద్రోహంచేసే నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అంగన్వాడీ వర్కర్స్ కు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, వేతనాలతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని కోరారు. హెల్ పర్ ప్రమోషన్‌కి నిర్దిష్టమైన గైడ్ లైన్స్ రూపొందించి అమలు చేయాలని, మే నెల అంతా వేసవి శెలవుకు జి.ఓ. వెంటనే ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.,ప్రీ-స్కూల్ బలోపేతం చేయాలి. తల్లికి వందనం పథకా న్ని అంగన్వాడీ పిల్లలకు వర్తింపజేయాలని,అంగన్వాడీ సెంటర్స్ కు ఇచ్చే సరుకుల నాణ్యతను, పరిమాణాన్ని పెంచాలనే తదితర డిమాండ్స్ కు తక్షణమే ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని పూర్ణిమ రాజు కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎ.రామలక్ష్మి, ఎమ్.వి.ఎస్. భాస్కర్, సెక్టార్ నాయకులు టి.ఎల్.పి.వి.కుమారి, టి.వి.ఎస్.లక్ష్మి, బి.మాధవి, విజయ కుమారీ, బి.కుమారి, టి.రత్నం, కే.చెంద్ర, భవానీ తదితరులు పాల్గొన్నారు.

# 'బార్'కు అనుమతి ఇచ్చినచో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన

### బీఎస్పీ జిల్లా అధ్యక్షులు పట్నాల విజయకుమార్

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** బొమ్మూరు కలెక్టరెట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల వేదికలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు పట్నాల విజయకుమార్ కలెక్టర్‌ను కలసి ఆల్కట్ గార్డెన్స్‌లో ఉన్న గేదెల నూకరాజు కల్యాణ మండపంలో ఏర్పాటు చేయుచున్న బార్‌కు అనుమతులు మంజూరు చేయవద్దని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి జిల్లా అధ్యక్షులు పట్నాల విజయ్ కుమార్, బిఎస్పి రూరల్ ఇన్ఛార్జ్ కొండపల్లి సూరిబాబు, బిఎస్పి రాజానగరం అధ్యక్షులు కొల్లాటి అబ్బులు, బిఎస్పి జిల్లా ఎడ్వైజర్ నక్కా వెంకటరత్నరాజు, బిఎస్పి రాజమండ్రి రూరల్ వార్డ్ ఇన్ఛార్జ్ కొత్తపల్లి శేఖర్ బాబు, బిఎస్పి మహిళా నాయకురాలు అవిడి సునీత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎస్పీ



జిల్లా అధ్యక్షులు పట్నాల విజయ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ రాజమండ్రి ఆల్కట్ గార్డెన్స్లో గల గేదెల నూకరాజు కళ్యాణ మండపంలో "బార్" పెట్టుటకు ప్రభుత్వం అనుమతిచ్చారని త్వరలో అందులో "బార్" పెడతారని తెలిసినదన్నారు. యిప్పటికే ఆ కళ్యాణ మండపానికి ఎటువంటి పార్కింగ్ స్థలం లేనందున, అందులో శుభకార్యములు జరిగిన రోజున ఆ కళ్యాణ మండపానికి వచ్చే వారి వాహనాలు రోడ్డు మీద పెట్టడం వలన తరచూ అక్కడ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. యిప్పుడు అందులో బార్ పెట్టినచో తరచూ రోజూ ట్రాఫిక్ అంతరాయం జరిగి ప్రమాదాలు ఎక్కువ అయ్యే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా అక్కడ ప్రజలు నివాసం ఉంటున్నారు. ప్రజల నివాసస్థలంలో బార్‌కి అనుమతి ఇవ్వడం అంతశ్రేయస్కరం కాదని అన్నారు. ఆ ప్రాంతం అంతా బ్లేడ్ బేచ్, పిక్ పాకెటర్స్, గంజాయి సేవించే వారు ఎక్కువగా తిరుగుతూ తరచూ గొడవలు, దొంగతనాలు జరిగే ప్రదేశమని, ఇప్పుడు ప్రభుత్వం అక్కడ బార్ పెట్టుటకు అనుమతి ఇచ్చినచో చాలా ప్రమాదాలకు దారి తీసే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. ఒక వేళ ప్రభుత్వం బార్ పెట్టుటకు అనుమతి ఇస్తే ప్రజా సంఘాలు ఆందోళనకు దిగి ధర్నాలు చేసి ప్రభుత్వం ఇచ్చే బార్ పర్మిషన్‌కి వ్యతిరేకంగా పోరాడటం జరుగుతుందన్నారు. గేదెల కళ్యాణమండపంలో బార్ పెట్టుటకు ఇచ్చే ఆదేశాలు విరమించుకొని, అక్కడ బార్ పెట్టకుండా చర్యలు తీసుకోవలసినదిగా కోరుతున్నామన్నారు.

# విద్యార్థులు డ్రగ్స్ జోలికి పోవద్దు

### భాష్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు : టౌన్ సిఐ సురేష్






**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై వారి బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని మండపేట టౌన్ సిఐ సురేష్ అన్నారు. మండపేట భాష్యం స్కూల్ లో మంగళవారం సిఐ సురేష్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో రేపటి తరం కోసం గంజాయి రహిత సమాజం ఇదే మా సంకల్పం పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల జోలికి పోవద్దని, వీటి బారిన పడితే జీవితం నాశనం అవుతుందని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాల దృష్ట్యా సైబర్ క్రైమ్లు విపరీతంగా పెరుగుతున్నాయని యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు. పోక్సో చట్టం ను వివరిస్తూ బాలికలు, మహిళలు పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టాలు కఠినంగా ఉన్నాయని తెలిపారు. మహిళలను గౌరవించాలని వారి స్వేచ్ఛను భంగం కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్‌ని కలిసిన
# ఎమ్మెల్యే జోగేశ్వరరావు, లీలాకృష్ణ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** వెలగపూడిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయం లో మంగళవారం శాసనసభ విరామ సమయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండపేట నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొం టున్న పలు సమస్యలను ఉప ముఖ్యమంత్రికి వివరించారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. ముఖ్యంగా అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల మెరుగుదల, సాగునీటి సమస్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## కల్తీ పాల సరఫరాపై
# సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

### మృతుల కుటుంబలకు రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
### రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** రాజమండ్రిలో కల్తీ పాల ఘటన తీవ్ర భయాందోళనకు గురిచేసిందనీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు అన్నారు. విషపు పాలు తాగి రెండు రోజుల్లో నలుగురు చనిపోవడం అత్యంత బాధాకరమన్నారు. కిడ్నీ సమస్యతో పరిస్థితి విషమించి 8 మంది ఆసుపత్రుల్లో చేరడం ఆందోళనకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆసుపత్రుల్లో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న వారికి తక్షణం మెరుగైన వైద్యసేవలు అందించాలనీ డిమాండ్ చేశారు. చనిపోయిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు రూ 50 లక్షల రూపాయలు ఎక్స్గ్రేసియాగా చెల్లించాలని డిమాండ్ చేశారు.కల్తీ పాల సరఫరాపై నిజాలు నిగ్గుతేల్చాలనీ కోరారు. ఉన్నత స్థాయి కమిటీ నియమించి దర్యాప్తు ముమ్మరం చేయాలన్నారు. కల్తీ పాలు ఘటనలో బాధితుల సంఖ్య పెరగకుండా తక్షణం మెడికల్ క్యాంపు లు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించి ప్రభుత్వం ఆదుకోవాలని కామన ప్రభాకరరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్ని పాల కేంద్రలను, ప్రతి గ్రామంలో ఉన్న పాల వ్యాపారాలు చేసే వ్యక్తులకు లైసెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.


## సీతానగరం మండలంలో పలువురికి
# సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించిన బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురికి శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అందజేశారు. మిర్తిపాడు గ్రామానికి చెందిన నారి అబ్బులుకు రూ 37,100 /లు, నల్ల సాయి కీర్తనకు రూ.32000/-లు, దారా శ్రీనుకు రూ. 78,770/- లు, మద్ది పోటి రాంబాబుకు రూ.94,398/-లు, కేదాసి పోశమ్మకు రూ.36,273/- లు, విత్తనాల రాధకు రూ.50,200/-లు, ఉండేశ్వరపురం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి లక్ష్మి భవానికి రూ.20,675/-లు, లంక పెద్దకాపుకు రూ.42,465/- లు, నాగోతు విజయలక్ష్మి కి రూ. 24,792/-లు, వడిశెట్టి సూర్యనారాయణకు రూ.51,014/-లు, స్వయంగా వారి గృహాలకు వెళ్లి వారికి అందించారు. ముగ్గళ్ళ గ్రామానికి చెందిన షేక్ చిన్న వలి అనారోగ్య రీత్యా వైద్య ఖర్చులు నిమిత్తం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సహాయమును కోరగా వెంటనే స్పందించి సీఎం సహాయ నిధి ద్వారా రూ.1,51,500/-ల ఎల్ఓసిని వారి కుటుంబ సభ్యులకు నా సేవ కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి చేతుల మీదుగా అందించారు.

# న్యాయవాది పవన్‌పై దాడిని ఖండిస్తున్నాం

### కర్నూలులో ఘటనకు నిరసనగా నేడు న్యాయవాదులు విధుల బహిష్కరణకు మద్దతు
### వైసీపీ లీగల్ సెల్ మాజీ అధికార ప్రతినిధి రాజు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్నూలు బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది ఎం పవన్ కుమార్ పై, కర్నూలు 4వ పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్, చేసిన దాడిని ఖండిస్తూ, బుధవారం తూర్పు గోదావరి జిల్లాలోనిరాజమండ్రి బార్ అసోసియేషన్ న్యాయవాదులందరూ తమ తమవిధులను బహిష్కరిస్తారు. తూర్పుగోదావరి జిల్లా, వైయస్సార్సీపి లీగల్ సెల్ ఈ విధుల బహిష్కరణ కార్యక్రమానికి సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నట్లు వైసీపీ లీగల్ సెల్ మాజీ అధికార ప్రతినిధి పి.వి.వి.ఎస్.బి. రాజు తెలిపారు, కర్నూలు ఫోర్త్ టౌన్ సిఐ పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.,ఈ మేరకు వైయస్సార్సీపి లీగల్ తూర్పు గోదావరి జిల్లా మాజీ అధికార ప్రతినిధి, పి వి వి ఎస్ బి రాజు, సాదిక్ హుస్సేన్, దూడల వీర వెంకట త్రినాథ్, హసీనా బేగం, చెరుకూరి రామారావు చౌదరి, చింతపర్తి రాంబాబు, సందశి చినబాబు, డి రాజారత్నం, బడుగు రాజు, కే.నంద, కే శంకర్రాజు, జీవి కిరణ్ కుమార్, ఎం హేమంత్ కుమార్, బడుగు ముసలయ్య,జి ఏడుకొండలు,సిద్ధార్థ దొర, తదితరులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

# కోరుకొండలో 2వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కోరుకొండ ప్రాజెక్టులో మంగళవారం రెండో రోజు రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. మంగళవారం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో సి ఐటియు జిల్లా కార్యదర్శి బివిఎన్ పూర్ణిమ రాజు మాట్లాడుతూ అంగన్వాడీలు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తేవాలని, అవసరమైతే అన్ని కార్మిక సంఘాలు తమకు వెన్నుదన్నుగా నిలుస్తాయన్నారు. ఈనెల 25,26,27, మూడు రోజులు రాజమహేంద్రవరం జిల్లా సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందని,కార్మికులకు ద్రోహం చేసే నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేసి,అంగన్వాడీ వర్కర్స్ కు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని,గ్రాట్యూటీ అమలు చేయాలని,వేతనాలతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్ కి నిర్దిష్టమైన గైడ్ లైన్స్ రూపొందించలని,మే నెల అంతా వేసవి శెలవుకు జిఓతో పాటు, పెండింగ్ లో ఉన్న 164 సూపర్ వైజర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని,ప్రీ-స్కూల్ బలోపేతం చేసి, తల్లికి వందనం పథకాన్ని అంగన్వాడీ పిల్లలకు వర్తింపజేయాలని,అంగన్వాడీ సెంటర్స్ కు ఇచ్చే సరుకుల నాణ్యతను, పరిమాణన్ని పెంచాలని డిమాండ్ చేశారు. మార్చి రెండున విజయవాడలో తలపెట్టనున్న ధర్నాను అందరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎ.రామలక్ష్మి, ఎమ్‌విఎస్ భాస్కర్, టిఎల్ పివి కుమారి, టివిఎస్ లక్ష్మి, బి.మాధవి, విజయకుమారీ, బి.కుమారి, టి.రత్నం, కే.చెంద్ర, మూడు మండలాల హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.



# భూ సమస్యల పరిష్కారంలో వేగం పెరిగింది

## రెవెన్యూ క్లినిక్‌లతో సులభ పరిష్కారం - జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

భూ సమస్యల పరిష్కారంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్‌కు ప్రాధాన్యమిస్తూ ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా అందుబాటులోకి తెచ్చిన రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా భూ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమైందని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి. జయలక్ష్మి అమరావతి నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లు, మ్యూటేషన్లు, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, రీ-సర్వే, కుల విచారణలు, ఐవీఆర్ఎస్ సేకరణ, రెవెన్యూ డిజిటల్ రికార్డుల రూపకల్పన తదితర అంశాల పురోగతిపై దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ పరిపాలనలో అత్యంత ముఖ్యమైన రెవెన్యూ అంశాలపై సమన్వయంతో పనిచేసి ఆశించిన పురోగతి సాధించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదుల స్వీకరణ, ట్రాకింగ్, పరిష్కారం కోసం ఆన్‌లైన్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసి సకాలంలో పరిష్కార మార్గాలు చూపాలని సూచించారు. ఫిర్యాదు నమోదు నుండి పరిష్కారం వరకు ట్రాకింగ్ సదుపాయంతో అర్జీదారులకు శతశాతం న్యాయం అందేలా చూడాలని పేర్కొన్నారు. నిర్దిష్ట గడువుల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వివిధ స్థాయిలలో సమీక్షలు నిర్వహిస్తూ వ్యవస్థ నిర్వహణపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని తెలిపారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రెవెన్యూ క్లినిక్‌లు రెవెన్యూ ఫిర్యాదులను వేగంగా, పారదర్శకంగా, నాణ్యతతో పరిష్కరించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. మండల తహసీల్దార్లు, ఆర్డీవోలు సంబంధిత రికార్డులతో సహా



అందుబాటులో ఉంటూ సమస్యలను ఒకే వేదికపై పరిష్కరిస్తున్నారని తెలిపారు. అడంగల్‌లో తప్పుల సవరణ, ఎఫ్-లైన్ అర్జీలు, రీ-సర్వే సమస్యలు, జాయింట్ ఎల్‌సీఎం సమస్యలు, నిషేధిత భూముల రిజిస్టర్ నుంచి పట్టా భూముల తొలగింపు, ఆక్రమణల తొలగింపు, డీ-పట్టా సమస్యలు, ఇళ్ల స్థలాల పట్టాలు, భూ సేకరణ సమస్యలు వంటి అంశాల్లో రెవెన్యూ క్లినిక్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు వివరించారు. సాంకేతికపరమైన భూ సమస్యలు, మీ భూమి వెబ్‌సైట్‌కు సంబంధించిన సమస్యలు, సుమోటో కరెక్షన్లు, అడంగల్ నకళ్లు, కంబైన్డ్ స్పేర్ వంటి అంశాలపై వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే వేదికపై సమస్యల పరిష్కారం లభించేలా ఈ కార్యక్రమం దోహదం చేస్తోందని చెప్పారు. రెవెన్యూ వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవహారం, ప్రజల నమ్మకాన్ని పెంపొందించడంలో రెవెన్యూ క్లినిక్‌లు కీలకంగా నిలుస్తున్నాయని స్పష్టం చేశారు. మ్యూటేషన్, రికార్డు దోషాల సవరణ, వారసత్వ నమోదు తదితర సేవలను సమగ్రంగా అందించాలని ఆదేశించారు. కొనుగోలు, వారసత్వ నమోదు వంటి భూ యాజమాన్య మార్పులను వేగవంతం చేస్తూ పారదర్శకతతో పని చేయాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ, టైమ్‌బౌండ్ క్లియరెన్స్, పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పట్టాదారు పాస్ పుస్తకాలలోని పేరు, సర్వే నంబర్, విస్తీర్ణం వంటి దోషాలను గుర్తించి సవరించాలన్నారు. ధృవీకరణ అనంతరం సవరించిన పాస్ పుస్తకాలను ప్రతి నెల 2వ తేదీ నుంచి 9వ తేదీ మధ్య గ్రామ సభల ద్వారా ఆయా యజమానులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుల ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను అర్హులకు కేటాయించడం, గృహ నిర్మాణం మరియు వ్యవసాయ అవసరాల కోసం పట్టాలు జారీ చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. పంపిణీ అనంతరం రికార్డులను సకాలంలో అప్‌డేట్ చేయాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిషాంతి మాట్లాడుతూ డ్రోన్లు, డీజీపీఎస్, కోర్స్ టెక్నాలజీ ద్వారా సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో ఖచ్చితమైన సర్వే నిర్వహించి అర్హులకు రాజముద్రతో కూడిన భూ పట్టాలు జారీ చేయాలని అన్నారు. పాత రికార్డులతో తేడాలను సమీక్షించి సరిదిద్దాలని సూచించారు. కుల ధృవపత్రాల జారీకి డిజిటల్ ధృవీకరణ విధానాన్ని అమలు చేసి తప్పుడు ధృవపత్రాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్ కోసం వాయిస్ ఆధారిత సేవలు, బహుభాషా మద్దతు వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఐవీఆర్ఎస్, గ్రామ సభలు, ప్రత్యేక సమావేశాల ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి సంతృప్తి స్థాయిని పెంపొందించాలని పేర్కొన్నారు. రెవెన్యూ డిజిటల్ రికార్డుల తయారీ, భూ రికార్డుల పూర్తి డిజిటలైజేషన్, మ్యాప్‌లతో అనుసంధానించిన ఆన్‌లైన్ డేటాబేస్ వ్యవస్థను అందుబాటులోకి తేవాలని సూచించారు. రెవెన్యూ క్లినిక్‌లు భూ వివాదాలు, రికార్డు సవరణలకు సింగిల్ విండో విధానంలో పనిచేసి ప్రజా సంతృప్తిని పెంచాలని ఆదేశించారు. ప్రతి పథకంపై ప్రజాభిప్రాయం తప్పనిసరిగా సేకరించాలని తెలిపారు.

# జిల్లాలో శాంతి భద్రతలే లక్ష్యం

## నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు : జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**



శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో మాసిక నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని ఉప విభాగ పోలీసు అధికారులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఉప ఇన్‌స్పెక్టర్లతో కలిసి నేరాల అదుపు, పెండింగ్ కేసులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై సమగ్రంగా సమీక్షించారు. నేర, నేరస్థుల ట్రాకింగ్ నెట్‌వర్క్ వ్యవస్థ డేటా ఆధారంగా జిల్లాలో నమోదైన కేసుల ప్రస్తుత స్థితిగతులను సమీక్షించారు. ముఖ్యంగా మూడేళ్లకు పైబడిన పెండింగ్ విచారణలో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. డ్రోన్ వినియోగం, ఒకటి ఒకటి రెండు అత్యవసర సేవలు, ఈ-చలానా వసూళ్లు, వాట్సాప్ పరిపాలన ద్వారా ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు. ఈ-సాక్ష్య, కేంద్ర పరికర గుర్తింపు రిజిస్టర్ నివేదికలు, మెడ్‌లీప్రా అనువర్తనాల పనితీరుపై దిశానిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో జరగనున్న జాతరలు, పండుగల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమాలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. కులపరమైన సమస్యలు తలెత్తకుండా సామరస్య కమిటీల ద్వారా శాంతి వాతావరణం నెలకొల్పాలని సూచించారు. రౌడీ షీటర్ల కదలికలపై కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని, పెండింగ్ వారెంట్లు మరియు అరెస్టులను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మార్చి 14న నిర్వహించనున్న లోక్ అదాలత్ సందర్భంగా నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా చర్యలు తీసుకుని, ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. రాత్రి వేళల్లో గస్తీని పెంచాలని, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని అధికారులకు సూచించారు.

### మెడికల్ షాపుల్లో స్పష్టమైన

# ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయండి

### జీఎస్టీ తగ్గింపు ప్రయోజనం ప్రజలకు చేరాలి



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మెడికల్ షాపుల్లో మందుల ధరలు ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా తగ్గించి అమ్మేలా చర్యలు తీసుకోవాలని స్థానిక వినియోగదారుల సంఘం డిమాండ్ చేసింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొన్ని ఔషధాలపై జిఎస్టి తగ్గించిన నేపథ్యంలో, ఆ ధర తగ్గింపులను వినియోగదారులకు పూర్తిగా అందేలా మెడికల్ షాపులు వ్యవహరించాలని కోరారు. అలాగే ఏ మందుపై ఎంత శాతం ధర తగ్గిందో స్పష్టంగా చూపించే విధంగా ప్రతి మెడికల్ షాప్‌లో ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అంబాజీపేట మండల వినియోగదారుల సంఘం అధ్యక్షులు, కోకో ఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి , జిఎస్టి అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావుకి మంగళవారం వినతి పత్రం సమర్పించారు. జిఎస్టి తగ్గింపు వల్ల ప్రభుత్వం కల్పించిన ప్రయోజనం నేరుగా ప్రజలకు చేరేలా అధికారులు కఠినంగా పర్యవేక్షణ చేయాలని వారు అభ్యర్థించారు. ప్రభుత్వం తీసుకున్న ప్రజాహిత నిర్ణయాలు అమలులో సక్రమంగా జరిగితేనే వినియోగదారులకు నిజమైన లాభం కలుగుతుందని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. జనరిక్ మందులను సైతం ఎమ్మార్పీ రేట్లు అమ్ముతున్నారని జనరిక్ మందులను పూర్తిగా ప్రభుత్వం నిర్ణయించే రేట్లకే ప్రైవేటు మందులు షాపులలో విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు వలవల శ్రీనివాసు (బాబి), వీరా సతీష్, అరిగెల చిన్ని తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో

# ముఖ్యమైన భాగం



### ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

**పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ అసెంబ్లీ స్పోర్ట్స్ మీట్-2026 కార్యక్రమంలో భాగంగా విజయవాడలోని ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియంలో వాలీబాల్, టగ్ ఆఫ్ వార్ (తగ్ ఫైట్), కబడ్డీ పోటీలు ఉత్సాహంగా నిర్వహించబడ్డాయి. ఈ పోటీల్లో పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్యమైన భాగం. సామాన్యులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా శారీరక వ్యాయామం చేయడం ఎంతో అవసరం. ఆరోగ్యకరమైన జీవనశైలికి క్రీడలు ఎంతో తోడ్పడతాయి" అని పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదల పవన్ కళ్యాణ్, స్పీకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఆనందదాయకమని తెలిపారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు

### బడి బస్సుల భద్రతపై

# కీలక సమావేశం

### ఫిబ్రవరి 25న కలెక్టరేట్‌లో నిర్వహణ

### జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావు




**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బడి బస్సుల భద్రత అంశంపై ఫిబ్రవరి 25వ తేదీన నిర్వహించనున్న ముఖ్య సమావేశానికి పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా రవాణాధికారి డి. శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఇటీవల జిల్లాలో చోటుచేసుకున్న బడి బస్సుల రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎక్కువ శాతం ప్రమాదాలకు డ్రైవర్ల నిర్లక్ష్యమే కారణమవుతున్నదని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండేందుకు కఠిన చర్యలు తీసుకోవడం అత్యవసరమని స్పష్టం చేశారు. పోలీసు శాఖ, రవాణా శాఖ, విద్యాశాఖలు సంయుక్తంగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నాయని తెలిపారు. మోటారు వాహనాల చట్టంలోని 185(జి) నిబంధనల అమలుపై సమగ్ర చర్చ జరగనున్నట్లు వెల్లడించారు. బడి బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవర్ల అర్హతలు, వేగ నియంత్రణ పరికరాలు, మద్యం సేవించి వాహనం నడపడం వంటి అంశాలపై కఠిన పర్యవేక్షణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ఈ సమావేశం నిర్వహించబడుతుంది. జిల్లా పోలీసు అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి, జిల్లా రవాణాధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, అలాగే ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. బడి బస్సుల భద్రత విద్యార్థుల ప్రాణాలతో ముడిపడి ఉన్న అత్యంత ముఖ్యమైన అంశమని, అందరూ బాధ్యతగా పాల్గొని విలువైన సూచనలు ఇవ్వాలని జిల్లా రవాణాధికారి కోరారు.

### బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో

# టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ పూల్ క్యాంపస్ డ్రైవ్



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ప్రముఖ ఐటీ సంస్థ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) కు సంబంధించిన పూల్ క్యాంపస్ నియామక కార్యక్రమం నిర్వహించబడనుంది. ఈ నియామక ప్రక్రియ ద్వారా డేటా ప్రాసెసింగ్, బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్ ట్రైనింగ్ విభాగాల్లో అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ కె.రాజశేఖర్ తెలిపారు. ఈ నియామకానికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ లేదా కళాశాలల నుండి 2024, 2025, 2026 సంవత్సరాలలో బీఏ, బీకాం, బీఎస్సీ (బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ / ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మినహా), బీబీఎం, బీఎంఎస్, బీబీఐ, బీబీఏఫ్ డిగ్రీలను పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని వివరించారు. విద్యార్హతలు పూర్తి చేసిన యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో కెరీర్‌ను ప్రారంభించాలని ఆశించే అభ్యర్థులకు ఇది ఒక సువర్ణావకాశమని కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ బోనం కనకదుర్గ తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులందరూ ఈ పూల్ క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని ఆమె పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ. మహేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. ప్రవీణ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏ.వై.ఆర్.వి. ప్రసాద్ పాల్గొన్నారు.

# అక్రమ సాగు ఆగకపోతే కరెంట్ కట్ చేస్తాం



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** కాట్రేనికోన మండలం దొంతికుర్రు గ్రామంలో మంచినీటి చెరువు సాగుకు అనుమతులు పొంది ఉప్పునీటి సాగు చేస్తున్న రైతుకు మంగళవారం తాసిల్దార్ ఆధ్వర్యంలోని మండల కమిటీ నోటీసులు జారీ చేసింది. కొత్తపల్లి నరసింహమూర్తి అనే వ్యక్తి చేపల చెరువు చేసేందుకు అనుమతి పొందాడు. తర్వాత దానిని రొయ్యల చెరువుగా మార్చాడు. ఉప్పు నీటిని పక్కనే ఉన్న మంచినీటి బోదేలోకి దింపడంతో చుట్టుపక్కల వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో బాధితులు జిల్లా కలెక్టర్ ను ఆశ్రయించారు. విద్యుత్ శాఖ ఎస్ ఈ సంబంధిత విషయమై క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితులకు న్యాయం చేయాలని మండల స్థాయి కమిటీని ఆదేశించారు. దీంతో తాసిల్దార్, విద్యుత్ శాఖ ఏఈ, మత్స్యశాఖ ఏఈ, వ్యవసాయ శాఖ తోపాటు సంబంధిత అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. వాస్తవాలను నిగ్గు తేల్చారు. దీంతో కొత్తపల్లి నరసింహమూర్తికి నోటీసులు జారీ చేశారు. చేపల చెరువు గా మార్చుకోవాలని, లేదా విద్యుత్ కనెక్షన్ ను తీసేస్తామని హెచ్చరించారు.

### కాంగ్రెస్ పార్టీ అప్రతిష్ఠపాలు చేయాలనుకోవడం

# దేశప్రయోజనాలకు భంగకరం


### పాలూరి సత్యానందం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యువజన కాంగ్రెస్ కార్యకర్తల వీరంగం సిగ్గుచేటు బిజెపి జిల్లా అధ్యక్షులు అడబాల మండపేటలో మహిళా మోర్చ ఆధ్వర్యంలో యల్లాన శకుంతల అధ్యక్షతన మున్సిపల్ ఆఫీస్ నుండి కపిలేశ్వరపురం రోడ్లో ర్యాలీ నిర్వహించారు ఈకార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం పాల్గొని మాట్లాడుతూ దేశరాజధాని డిల్లీలో భారత్ మండపం వేదికగా ఏఐ సమ్మిట్ సమావేశంలో రాహుల్ గాంధీసూచనలతో యూత్ కాంగ్రెస్ నాయకులు చొక్కాలువిప్పి వీరంగం చేసినవారు పాస్ లతో వచ్చారా,క్యూఆర్ కోడ్ తో లోపలికి ప్రవేశించారా అనేది ఆరాతీసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇన్నోవేషన్ కు పెద్దపీటవేస్తూ ప్రతిష్ఠాత్మక గ్లోబల్ ఏఐసమ్మిట్ కు భారత్ ఆతిధ్యం ఇస్తుంటే కాంగ్రెస్ పార్టీ అప్రతిష్ఠపాలు చేయాలను కోవడం దేశప్రయోజనాలకు భంగకరమని అన్నారు. ఇటువంటి అంతర్జాతీయంగా దేశప్రతిష్ఠను దెబ్బతీయడం తగదని వార్ని క్షమించరాదని అన్నారు. ఈకార్యక్రమంలో మైనార్టీమోర్చ జిల్లా అధ్యక్షులు సాదిక్,సీనియర్ నాయకులు కోన సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు చాట్రాతి రాంబాబు,కోటిపల్లి సాయిరాం,ఐటిసెల్ కన్వీనర్ చుంద్రు సాయిరాం బార్గవ్,,కోటిపల్లి శ్రావణి, మద్దుల రేణుకాదేవి, మండపేట పట్టణ అధ్యక్షులు నాళం పణిప్రకాష్ మద్దుల సుబ్బారావు, కోటిపల్లి క్రిష్ణ, గురజాపు శ్రీనువాస్, నీల చిన్న కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాతృభాషతోనే మానసిక వికాసం.. : డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాతృభాషే మన స్వాభిమానమని డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ డైరెక్టర్ డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. ఐడబ్ల్యుహెచ్‌సి జి.సి. బాలికల హాస్టల్‌లో 8, 9, 10 తరగతి విద్యార్థినుల కోసం శనివారం నిర్వహించిన "మాతృభాషా బోధన" సెమినార్ ఉత్సాహభరితంగా, ఆలోచనాత్మకంగా జరిగింది. విద్యార్థినుల్లో తెలుగు పట్ల గర్వభావం, అవగాహన పెంచే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా మాతృభాషల పరిరక్షణ అవసరాన్ని గుర్తు చేస్తూ, యునెస్కో 1999లో ఫిబ్రవరి 21ను అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించిన విషయం ప్రస్తావించారు. ప్రధాన అతిథి డా. హిప్నో పద్మా కమలాకర్




మాట్లాడుతూ భాష అనేది కేవలం మాటల సమాహారం కాదు... అది మన సంస్కృతి, మన భావాలు, మన గుర్తింపు అన్నారు. ఒక భాష అంతరించిపోవడం అంటే ఆ భాషకు చెందిన జానపద గాథలు, సామెతలు, సాహిత్యం, జ్ఞాన సంపద, సంప్రదాయాలన్నీ కనుమరుగవడమే" అని పేర్కొన్నారు. మన తెలుగు భాషను సులభంగా, అందరికీ అర్థమయ్యేలా చేయాలని కృషి చేసిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి రోజున మనం తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు. ప్రత్యేక అతిథి డాక్టర్ ఎమ్. హరి విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచ భాషలను నేర్చుకోవడం అవసరం... కానీ మాతృభాషను విస్మరించడం ప్రమాదకరం.. వాడనిది ఏదైనా ఉనికి కోల్పోతుందన్నారు. గౌరవ అతిథి డాక్టర్ మైదవోలు పద్మజా రాణి తెలుగు సాహిత్య వైభవాన్ని వివరిస్తూ, మంచి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ డాక్టర్ పి.రమేష్ కుమార్, హాస్టల్ వార్డెన్ ఎ.సూర్య కుమారి, నిర్వాహకులు ముత్తాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి జిల్లా ప్రేమ అప్యాయతల విందు

## కాకినాడ, అమలాపురం పార్లమెంటు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, కుటుంబసభ్యులతో మంత్రి నారా లోకేష్ ఆత్మీయ కలయిక






**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆత్మీయ ఆతిథ్యానికి చిరునామా అయిన గోదావరి జిల్లా పరిధి కాకినాడ, అమలాపురం పార్లమెంటు కూటమి ప్రజాప్రతినిధులు వారి కుటుంబసభ్యులకు మంత్రి నారా లోకేష్ ఉండవల్లి నివాసంలో మంగళవారం ఇచ్చిన విందు ప్రేమ ఆప్యాయతలతో సాగింది. గోదావరి జిల్లాలకు వెళితే ఎంత చక్కటి ఆతిథ్యం ఇస్తారో..అదే అతిథి మర్యాదలతో ఆత్మీయ కలయిక ఆనందంగా గడిచింది. గోదావరి జిల్లాకే ప్రత్యేకమైన రుచులు, చిత్రాలు, ప్రతిమలతో ఆతిథ్యం ఇచ్చిన లోకేష్ ను సత్కరించారు. ఈ సందర్భంగా లోకేష్ నేతలపై ఓ బాధ్యత మోపారు. తన తమ్ముడు అమలాపురం ఎంపీ జీఎం హరీష్ బాలయోగికి మూడు నెలల్లో పెళ్లి చేయాలని, సంబంధాలు చూడాలని ప్రజాప్రతినిధులను కోరారు. ప్రేమ పెళ్లిళ్ల గురించి ఆసక్తికరమైన చర్చ సాగింది. ప్రేమించి, ఇరుపక్షాలనూ ఒప్పించి పెళ్లి చేసుకున్నామని..ప్రేమ వివాహమే మా జీవితాలకు వెలుగునిచ్చిందని ఎంపీ సానా సతీష్ బాబు, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ తమ ప్రేమ పోరాటాలను, పెళ్లి విజయాలను చెప్పారు. ఆయా ప్రజాప్రతినిధులు తమ పరిధిలో అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారం కోసం మంత్రి నారా లోకేష్ కు ఇచ్చిన దరఖాస్తుల తాజాస్థితిని తెలుపుతూ ఓ నివేదికను ప్రజాప్రతినిధులకు అందజేశారు. తన ఆహ్వానాన్ని మన్నించి ఆత్మీయ కలయికకు హాజరైన ప్రజాప్రతినిధుల కుటుంబసభ్యులకు మంగళగిరి పట్టుచీరలను లోకేష్ బహూకరించారు. ఈ ఆత్మీయ కలయికకు కాకినాడ పార్లమెంటు నుంచి ఎంపీ సానా సతీష్ బాబు (రాజ్యసభ), ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ (ప్రత్తిపాడు), వనమాడి వెంకటేశ్వరరావు (కాకినాడ సిటీ) పంతం వెంకటేశ్వరరావు (కాకినాడ రూరల్ జనసేన), జ్యోతుల వెంకట అప్పారావు నెహ్రూ (జగ్గంపేట), ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, కర్రి పద్మశ్రీ, పిడుగు హరిప్రసాద్...అమలాపురం ఎంపీ జీఎం హరీష్ బాలయోగి, ఎమ్మెల్యేలు మంత్రి వాసంశెట్టి సుభాష్ (రామచంద్రాపురం), దాట్ల సుబ్బరాజు (ముమ్మిడివరం), అయితాబత్తుల ఆనందరావు (అమలాపురం), దేవ వరప్రసాద్ (రాజోలు జనసేన), గిన్ని సత్యనారాయణ (పి గన్నవరం జనసేన), బండారు సత్యానందరావు (కొత్తపేట), వేగుళ్ల జోగేశ్వరరావు (మండపేట) కుటుంబాలతో హాజరయ్యారు.

### పిఠాపురం నియోజకవర్గ

# పట్టణాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

**పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీల్లో చేయాల్సిన పనుల గుర్తింపు**
**గత పర్యటనలో పవన్ కళ్యాణ్ దృష్టికొచ్చిన సమస్యలను పరిశీలించిన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అధికారుల బృందం**
**ఉప ముఖ్యమంత్రివర్యుల సూచనలతో నియోజకవర్గంలో విస్తృత పర్యటన - ప్రాధాన్యాలవారీగా త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభం**
**మంగళవారం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించిన అధికారులు**
**బుధవారం పిఠాపురంలో స్వయంగా సమీక్ష చేయనున్న ఆ శాఖ సంచాలకులు డాక్టర్ సంపత్**



**పిఠాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం మున్సిపాలిటీ , గొల్లప్రోలు నగర పంచాయతీల సమగ్రాభివృద్ధికి ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు ప్రణాళికలు సిద్ధం చేయిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తీర్చేలా, పెండింగ్ లో ఉన్న పనులను పట్టాలెక్కించేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. పారిశుద్ధ్యం, ముంపు సమస్య, సౌకర్యాల కల్పన, స్థానిక సంస్థల ఆదాయం పెంపు, మౌలిక వసతుల కల్పన మీద ప్రధానంగా దృష్టి సారించారు. దీనికి సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు, అవసరం అయిన పనులను గుర్తించేందుకు రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖల అధికారులు మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అందుబాటులో ఉన్న అవకాశాలను ఉపయోగించుకొని స్థానిక సంస్థలకు ఆర్థిక బలం చేకూర్చడం, అభివృద్ధి పనులను వివిధ పథకాల నిధులతో అనుసంధానం చేసి మొదలుపెట్టేందుకు ఉన్న అవకాశాలపై అధికారులు సమగ్ర అధ్యయనం చేశారు. పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో ప్రధానమైన సమస్యలు, పనులను ప్రాధాన్యతలను తెలుసుకున్నారు.

**ఏలేరు కాలువ సమస్య పరిశీలన**

పిఠాపురం నియోజకవర్గంలో ఏలేరు కాలువ మూడు పాయలుగా విడిపోయి ప్రవహిస్తోంది. దీనిలో ప్రధానంగా చెరుకుల కాలువ ముంపు సమస్య అధికంగా ఉంది. సంక్రాంతి సంబరాల కోసం జనవరి 10వ తేదీన పిఠాపురంలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి నియోజకవర్గ ప్రజలు క్షేత్రస్థాయిలో చెరుకుల కాలువ ముంపు గురించి తెలియజేశారు. కాలువ స్వరూపం పరిశీలించి, సమస్యను అర్థం చేసుకున్న శ్రీ పవన్ కళ్యాణ్ గారు సమస్యకు పరిష్కారం వెతకాలని మున్సిపల్, అర్బన్ డవలప్మెంట్ అధికారులకు సూచనలు చేశారు. దీంతో ఈ సమస్యను పరిష్కరించే దిశగా ప్రణాళికలు రూపొందుతున్నాయి. ప్రత్యేకంగా కల్వర్టు నిర్మాణం చేయడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చని, అయితే ఇక్కడే రైల్వే పై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్న దృష్ట్యా మరో ప్రత్యామ్నయం కూడా ఆలోచించేలా అధికారులు ప్రణాళిక వేస్తున్నారు.

**మురుగు నీటి ట్రీట్మెంట్ ప్లాంట్లను ముందుకు తీసుకెళ్లేలా...**

పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో రెండు మురుగు నీటి ట్రీట్మెంట్ ప్లాంట్లు ఉన్నాయి. లారీల యార్డు, మసీదు మన్యం ప్రాంతాల్లో మురుగునీటి ట్రీట్మెంట్ ప్లాంట్లను ప్రతిపాదించారు. స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ గత ప్రభుత్వంలో ఈ పనులు ముందుకు సాగలేదు. నిధులు రాలేదు. వీటిని మళ్లీ మొదలు పెట్టేలా, పిఠాపురం పట్టణ మురుగునీటిని శుద్ధి చేసేందుకు వినియోగించేలా నిర్మించాలని అంచనాలు రూపొందిస్తున్నారు. దీంతోపాటు ఆర్ఆర్బీహెచ్ఆర్ కళాశాల స్థలంలో మధ్యలో నిలిచి పోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను అధికారుల బృందం పరిశీలించింది. పనులు జరిగిన తీరు, నిధుల లభ్యత, మళ్లీ ఖేలో ఇండియా పథకంలో స్టేడియం నిర్మించేందుకు ఉన్న అవకాశాలను చర్చించారు. అనంతరం తుక్కుపోగుల మున్సిపల్ సైట్ పరిశీలించి అక్కడ నగరవనానికి అనుసంధానంగా మున్సిపల్ ఆదాయం వచ్చేలా మున్సిపల్ స్థలంలో షాపింగ్ క్లాంప్లెక్స్ నిర్మాణం గురించి ప్రతిపాదనలు చేశారు. అనంతరం పలు కూడళ్లను పరిశీలించి వెడల్పు చేసేందుకు ఉన్న అవకాశాలు, ఆయా ప్రాంతాల్లో మున్సిపల్ కాంప్లెక్సుల నిర్మాణం వల్ల మున్సిపాలిటీకి పెరిగే ఆదాయం మీద అంచనాలు రూపొందించారు.

**గొల్లప్రోలుకు డంపింగ్ యార్డు సమస్య కీలకం**

నగర పంచాయతీగా ఉన్న గొల్లప్రోలు నగర పంచాయతీకి డంపింగ్ యార్డు సమస్య వేధిస్తోందని అధికారుల బృందం గుర్తించింది. దీంతోపాటు నగర పంచాయతీ భవనం పూర్తిగా శిథిలావస్థలో చేరుకున్న వైనాన్ని స్వయంగా పరిశీలించారు. నగర పంచాయతీకి చాలా ఏళ్లుగా డంపింగ్ యార్డు సమస్య ఉందని స్థానిక అధికారులు తెలిపారు. నగర పంచాయతీకి స్థలాల లభ్యత సమస్య ఉందని, దీంతో ప్రైవేటు వ్యక్తుల నుంచి డంపింగ్ యార్డు కోసం స్థలం కొనుగోలుకు సుమారు రూ. 2.50 కోట్ల నిధులు అవసరం అవుతాయని చెప్పారు. ప్రస్తుతం పిఠాపురం మున్సిపాలిటీ స్థలంలో చెత్త పారబోత చేస్తున్నామని, ఆయిల్ కు నిధులు చాలా అవుతున్నాయని వాపోయారు. స్థల కొనుగోలు విషయాన్ని ఉన్నతాధికారులకు ప్రత్యేకంగా తెలియజేస్తామని, అలాగే ఇతర శాఖల అందుబాటులో ఉంటే ఆ వివరాలు అందించాలని మున్సిపల్, అర్బన్ డవలప్మెంట్ అధికారులు కోరారు. గొల్లప్రోలు చెరువుకు ఆనుకొని షాపింగ్ క్లాంప్లెంక్స్ నిర్మాణం చేస్తే ఎలా ఉంటుందని ఆరా తీశారు. రోడ్లు, పార్కులు, డ్రైన్ల నిర్మాణం మీద ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్థానిక అధికారులకు సూచించారు.

**రేపు మున్సిపల్, అర్బన్ డెవలప్మెంట్ డైరక్టర్ సమీక్ష**

రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖల అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలు, గుర్తించిన పనులు, ఆయా ప్రాంతాల్లో చేయాల్సిన అభివృద్ధి విషయాల మీద సమీక్షించేందుకు బుధవారం రాష్ట్ర మున్సిపల్, అర్బన్ డెవలప్మెంట్ సంచాలకులు డాక్టర్ సంపత్ గారు స్వయంగా పిఠాపురం రానున్నారు. "పాడ" కార్యాలయంలో జరిగే ఈ సమీక్షకు పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీల అధికారులు, సిబ్బంది హాజరుకానున్నారు. మున్సిపాలిటీ, నగర పంచాయతీలో చేయాల్సిన పనులు, వాటి ప్రాధాన్యం, నిధుల కేటాయింపు, ఆదాయ అర్జన మీద డైరెక్టర్ సమీక్షించి దిశానిర్దేశం చేయనున్నారు. ముందుగా ఏ పనులను మొదలుపెట్టాలి.. వాటి ప్రాధాన్యం మీద సమీక్షలో అధికారుల వివరణ తీసుకోనున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలను, చేయాల్సిన పనులను మున్సిపల్, అర్బన్ డెవలప్మెంట్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డైరక్టర్ కు వివరించనున్నారు.

# ప్రత్తిపాడులో 'ఉద్యమిని' వేగవంతం చెయ్యండి

### డిసీఎం పవన్ కళ్యాణ్ ఆదేశం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వాలను వేగవంతం చెయ్యాలని ఈ నియోజకవర్గం సమన్వయకర్త, రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబీ)ని ఆ పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఉద్యమి సభ్యత్వాల నమోదును వేగవంతం చేసేందుకు కార్యాచరణను చర్చించేందుకు అమరావతిలోని పార్టీ కార్యాలయంలో పవన్ కళ్యాణ్‌ని సూర్యకిరణ్ మర్యాద పూర్వకంగా మంగళవారం కలిసారు. ఈ సందర్భంగా బాబీని ప్రత్తిపాడు నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితుల గురించి సూర్య కిరణ్‌ను పవన్ కళ్యాణ్ అడిగి తెలుసు కున్నారు. భేటీ అనంతరం ప్రత్తిపాడు నియోజకవర్గం మీడియాకు సూర్య కిరణ్ ఒక ప్రకటనను విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు చేర్చడంతో పాటు పార్టీ పటిష్ఠతకు పాటు పడాలని పవన్ కళ్యాణ్ తమను ఆదేశించారు అన్నారు. జన సైనికులకు, వీర మహిళలకు అండగా నిలిచేందుకు, వారి జీవితాలకు, కుటుంబాలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతోనూ, వారిని కొత్త తరం నాయకులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఉద్యమి సభ్యత్వాల నమోదు కార్యక్రమానికి పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారని బాబీ వెల్లడించారు. అధినేత ఆదేశాలతో ఉద్యమి సభ్యత్వాల జిల్లా ఇంచార్జ్ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్ సూచనలతో నియోజకవర్గంలో ఉద్యమిని ముందజంలో ఉంచేలా కృషి చేస్తానని మేడిశెట్టి సూర్యకిరణ్ వెల్లడించారు.

# 8.2 అడుగుల కొండ చిలువ పట్టివేత...!



**రౌతులపూడి, విశ్వం వాయిస్ న్యూస్ :** 8.2 అడుగులు, 12 కేజీల బరువు ఉన్న కొండ చిలువను ఎంతో చాకచక్యంగా పట్టుకున్నారు. దానిని అంతే జాగ్రత్తగా అటవీ ప్రాంతంలో సురక్షితంగా విడచి పెట్టారు. ఈ సంఘటన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం రౌతులపూడి మండలం ఎస్.అగ్రహారంలో మంగళవారం జరిగింది. అటవీశాఖ ఎస్.అగ్రహారం బీటులోని పంపా నది ప్రధాన గేట్ల వద్ద ఈ పైథాన్ సంచరిస్తూ ఉండగా చూసి దానికి రక్షణ చర్యలు చేపట్టారు. శంఖవరం మండల ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గంటిమళ్ళ నాగేశ్వరరావు పర్యవేక్షణలో మిగతా అటవీశాఖ సిబ్బంది సమక్షంలో స్నేక్ క్యాచర్ ఆర్.రాజేష్ అతని బృందం సభ్యులు ఈ పామును సురక్షితంగా చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ పాము వల్ల ఇటు ప్రజలకు, పశు పక్ష్యాదులకు, అలాగే మనుషులు వల్ల పాముకూ ఏ ప్రమాదమూ జరుగ కూడదని శంఖవరం మండల ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గంటిమళ్ళ నాగేశ్వరరావు నిర్ణయం తీసుకున్నారు. దీంతో దానిని అటవీ ప్రాంతంలో సురక్షితంగా విడచి పెట్టారు. ఈ సేవ్ పైథాన్ ఆపరేషన్లో శంఖవరం అటవీశాఖ సెక్షన్ సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

# గొల్లపాలెంలో కొనసాగుతున్న సహకార సంఘ దీక్షలు

### 9వ రోజు నిరసన తెలిపిన ఉద్యోగులు



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార సంఘం(జేఏసీ) పిలుపు మేరకు కాజులూరు మండల సహకార సంఘాల ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం 9వ రోజుకు చేరాయి. తమ న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలంటూ ఉద్యోగులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ డైరెక్టర్ జి.అప్పలరాజు, సంఘ సీఈఓలు వి.వెంకటసుబ్బారావు, సీహెచ్ మూలారెడ్డి, కే.వెంకటనరేష్, జి.శ్రీరాములు, వి.శ్రీరామచంద్రరావు, కే.త్రిమూర్తులు, కే.వెంకటేశ్వరావు, పి.శ్రీనివాస్ సీహెచ్ స్వాతికుమార్, సహకార సంఘ సిబ్బంది రామనాయుడు, శ్రీను, కాశీ, సిద్దు, సతీష్, సురేష్, మణికంఠ, కుమారి, సుబ్బలక్ష్మి, రమణమ్మ, శ్రీనివాస్, కొండ పాల్గొన్నారు.



### నారా లోకేష్‌తో విందు సమావేశంలో

# పాల్గొన్న ఎంపీ హరీష్ బాలయోగి

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఉండవిల్లిలోని తన నివాసంలో మంత్రి నారా లోకేష్ ఏర్పాటు చేసిన విందు సమావేశంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి పాల్గొన్నారు. డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఎమ్మెల్యేలతో కలసి జరిగిన ఈ విందు సమావేశం ఆద్యాంతం ఆహ్లాదకరంగా సాగింది.



### కల్తీ పాలు ఘటనపై

# జిల్లా యంత్రాంగం స్పందన అభినందనీయం

**చాలా బాధాకర సంఘటన - ప్రభుత్వపరంగా బాధితులకు పూర్తి వైద్య సహాయం**
**ఆర్థిక సహాయంపై సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు : ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కల్తీ పాలు సేవించి అనారోగ్యం పాలైన సంఘటనపై జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి జిల్లా అధికారుల తక్షణ స్పందన అభినందనీయమని రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక కిమ్స్, రెయిన్బో, ఆదిత్య ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను ఆమె పరామర్శించారు. ఎంపీ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల వద్దకు వెళ్లి, అందుతున్న వైద్య సేవలను ప్రత్యక్షంగా తెలుసు కున్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, కల్తీ పాలు సేవించి 15 మంది అనారోగ్యం పాలవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటనలో నలుగురు మరణించగా, మిగిలిన 11 మంది ఆసుపత్రుల్లోచికిత్స పొందుతున్నారని, వీరిలో ఇద్దరు చిన్నారులు ఉండటం మరింత విషాదకరమన్నారు. బాధితులకు అవసరమైన మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. వారి చికిత్స ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా భరిస్తుందని రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గణేష్ అనే పాల వ్యాపారి వద్ద పాల శీతలీకరణ యంత్రం నుంచి ఇథిలిన్ గ్లైకోల్ అనే రసాయనం లీక్ కావడం వల్లే ఈ ఘటన జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణలో వెల్లడైందన్నారు. ఈ రసాయనం ప్రభావం ముఖ్యంగా 60 ఏళ్లు పైబడినవారికి, ఐదేళ్ల లోపు పిల్లలకు, అలాగే అధిక రక్తపోటు, మధుమేహం ఉన్నవారికి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. సంఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే జిల్లా యంత్రాంగం ఆయా ప్రాంతాలకు చేరుకుని బాధితులను ఆసుపత్రులకు తరలించడం, రక్త నమూనాలు సేకరించడం, 42 మంది రైతుల నుంచి పాల నమూనాలు సేకరించి ప్రయోగశాలలకు పంపించడం వంటి చర్యలను ఆమె ప్రశంసించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నగరంలోని పాల శీతలీకరణ యంత్రాల పనితీరుపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అలాగే పాడి పశువులకు హార్మోన్ ఇంజెక్షన్లు ఇవ్వకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం బాధ్యత తీసుకుని బాధితుల వైద్య ఖర్చును పూర్తిగా భరిస్తోందన్నారు. అధికారులతో పాటు కూటమి నాయకులు పరిస్థితిని సమీక్షిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు. రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ, పాలు వినియోగించిన 293 మందికి రక్త పరీక్షలు నిర్వహించగా, ఇప్పటివరకు 241 మందికి వచ్చిన నివేదికలు సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు. మూల కారణాలను గుర్తించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సంబంధిత వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, జిల్లాలోని ఇతర డెయిరీలపై నిరంతర నిఘా, తనిఖీలు నిర్వహిస్తామని వెల్లడించారు. అలాగే పాలు, ఇతర ఆహార పదార్థాల కల్తీపై ఫిర్యాదుల కోసం ప్రత్యేక ఫోన్ నంబర్ ఏర్పాటు చేయడంతో పాటు, పూర్తిస్థాయి ప్రయోగశాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించినట్లు తెలిపారు.

# నడక మంచి వ్యాయామం.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి

**సినీ నటుడు భద్రంతో కలిసి ఆదిత్య ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు 5 కె వాక్**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** స్థానిక ఏ.కె.సి.కళాశాల పక్కన నున్న ఎన్టీఆర్ పార్క్ ఎదురుగా ఆదివారం ఉదయం 50 మంది ఎన్.ఎస్.ఎస్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు సినీ నటుడు భద్రం ఏర్పాటు చేసిన 5 కె వాక్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తో కలిసి పాల్గొన్నారు. కందుల మాట్లాడుతూ, ఇంత మంచి కార్యక్రమం చేపట్టి, స్ఫూర్తిని కలిగిస్తున్నం దుకు సినీ నటుడు డాక్టర్ భద్రం ను అభినందించారు. భద్రం స్ఫూర్తితో రేపటినుండి నడక ప్రారంభిస్తానని, నడక ఒక మంచి వ్యాయామం అని దీనివలన క్యాన్సర్,షుగర్,బి.పి వంటి రోగాలు కూడా మాయం అవుతాయని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి నేతృత్వంలో,డాక్టర్ జి. వి..ఎస్ నాగేశ్వరరావు ప్రేరణతో ఆదిత్య వాలంటీర్లతో పాటు, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ బి హెచ్. వి.రమాదేవి,బేటి విమల, బి.కిరణ్ కుమార్, పోలుకొండ సాయి రిటైర్డ్ జడ్జి విశ్వనాథ్, మాజీ కార్పొరేటర్ పిల్లి నిర్మల, ఆదిత్య ఎన్.ఎస్.ఎస్.యువ నాయకుడు జి.వినయ్,యశస్విని, శ్రావణి, ఎం.హరిప్రియ యానిమేషన్ కు చెందిన పి. మనోజ్ కుమార్,విష్ణు. సాత్విక్, ఎస్. సాయి మహేష్ కుమార్ పోసి రాము వినయ్ జగన్ చరణ్, జాహ్నవి సమీరా అశ్విని, అమృత, మనోజ్, జోసెఫ్ రఫీద్ తదితర వాలంటీర్లు పాల్గొన్నారు.5 కె నడకలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ మరియు యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లను అభినందించారు.

# ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ ఇచ్చేలా నిర్ణయం

**తూర్పు కాపుల ఓబిసి సర్టిఫికెట్ సమస్య పరిష్కారం - ప్రభుత్వ నిర్ణయం పట్ల తూర్పుకాపుల హర్షం..**
**రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ యశస్వి**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తూర్పు కాపు సామాజిక వర్గం 40 ఏళ్ళగా ఇబ్బందులు పడుతున్న కులధ్రువీకరణ సర్టిఫికెట్ సమస్యకు పరిష్కారం లభించిందని రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్మన్ పాలవలస యశస్వి తెలిపారు. తూర్పు కాపులకు ఓబిసి సర్టిఫికెట్‌లు మంజూరులో ఎదురవుతున్న సమస్యను పరిష్కరిస్తూ మైగ్రేషన్ సర్టిపికెట్ లేని వారికి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తూర్పుకాపులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌లు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌లు ఆర్డీవోలు, తహశీల్దార్‌లకు అధికారికంగా జీవోలు జారీ చేయడం జరిగిందన్నారు. ఆ విధంగా జీవోలు ఇచ్చిన కలెక్టర్‌లను కలిసి తమ కృతజ్ఞతలు తెలియజేయడం జరుగుతుం దన్నారు. అందులో భాగంగానే మంగళవారం బొమ్మూరు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి ధన్యవాదాలు తెలియజేశామ న్నారు. తూర్పు కాపులకు బిసి కులధ్రువీకరణ సర్టిఫికెట్‌ల కొరకు గత 40ఏళ్ళగా పోరాడుతున్నామ న్నారు. ఉత్తరాంధ్రలో తప్పితే ఇతర జిల్లాలో తూర్పుకాపులకు కులధ్రువీకరణ సమస్య ఉందన్నారు. 2006లో ఈ సమస్యకు పరిష్కారం లభించినప్పటికీ ఓబిసి సర్టిఫికెట్‌లు మంజూరులో సమస్యలు ఎదురవుతున్నాయ న్నారు. ఉత్తరాంధ్ర మూడు జిల్లాల మినహా ఇతర జిల్లాల్లో మైగ్రేషన్ సర్టిఫికెట్ లేనిదే ఓబిసి సర్టిఫికెట్ మంజూరు చేయడం లేదన్నారు. ఈ సమస్యపై సామాజికవర్గం పెద్దలంతా కూర్చొని సమస్యకు పరిష్కారానికి ఆలోచన చేశామన్నారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ పొందడం ద్వారా విద్యా, ఉద్యోగాల విషయంలో న్యాయం జరుగుతుందన్న ఆలోచనతో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళామ న్నారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, తూర్పుకాపులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌లు మంజూరు చేసేలా నిర్ణయం తీసుకుచ్చింద న్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌లు నిర్ణయం తీసుకుని జిల్లాస్థాయిలో ఆర్డీవోలకు, తహశీల్దార్‌లకు జీవోలు జారీ చేయడం జరిగిందన్నారు. అలాగే అధిక జనాభాకు అధిక రిజర్వేషన్‌లు అన్న నినాదంతో జనగణనతో పాటు కుల గణన కూడా జరగాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందన్నారు. రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర తూర్పు కాపు సంఘం అధ్యక్షులు మామిడి శ్రీకాంత్ మాట్లాడుతూ తూర్పు కాపులకు ఓబిసి సర్టిపికెట్ కొరకు అనేక పోరాటాలు చేపట్టడం జరిగిందన్నారు. ఓబిసి అంశం కేంద్ర పరిధిలో ఉన్నందున రాష్ట్రస్థాయిలో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌లు మంజూరు చేయడం వలన తూర్పు కాపు విద్యార్థులకు, నిరుద్యోగులకు కేంద్రప్రభుత్వ విద్యాసంస్థల్లో సీట్లు, ఉద్యోగవకా శాలు లభిస్తాయన్నారు. తూర్పుకాపు సంక్షేమ సంఘం ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షులు లోపింటి చిరంజీవి మాట్లాడుతూ ఓబిసి సర్టిఫికెట్‌ల సమస్యకు పరిష్కారం చూపినందుకు జిల్లా కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అలాగే జనగణనతో పాటు కులగణన కూడా నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలో తూర్పుకాపు సామాజికవర్గం అధిక సంఖ్యలో ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కోడిగుడ్ల రాంబాబు, జామి సత్యనారాయణ, బురిడి త్రిమూర్తులు, కంది రాఘవ, విక్టరీ వాసు, తలారి శ్రీనివాస్, కునుకు హేమకుమారి, మజ్జి సత్తిబాబు, ఆలమండ నాగేంద్ర, కోరాడ శ్రీనివాస్, బోడసింగ్ తులసి, చింత భాస్కరరావు, ఓలిపిల్లి లక్ష్మణరావు, కరిమజ్జి సత్యనారాయణ, ప్రకాష్, గిరడా ఏడు కొండలు తదితరులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన యువనేత తోట పృథ్వీరాజ్



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలో వైసీపీ నాయకులను పరామర్శించిన యువనేత తోట పృథ్వీరాజ్. పట్టణంలో గల 8వ వార్డు ఎస్.సి. సెల్ అధ్యక్షులు మచ్చా రామకృష్ణ కుమారుడు సూరిబాబు, 17 వార్డు ఇంచార్జ్ దుగ్గిరాల గణేష్‌లు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వారి ఇంటి వద్దకు వెళ్ళి ఆరోగ్య క్షేమ సమాచారాన్ని తెలుసుకుని కుటుంబసభ్యులకు ధైర్యాన్నిచ్చి త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శలో వార్డు కౌన్సిలర్, ఆర్‌టిఐ నియోజకవర్గం కన్వీనర్ మందపల్లి రవికుమార్, రాష్ట్ర యువజన విభాగం సహాయ కార్యదర్శి వాసిరెడ్డి అర్జున్, జిల్లా పార్టీ ప్రధానకార్యదర్శి యర్రగుంట మణికంఠ కుమార్, జిల్లా సోషల్ మీడియా కమిటీ మెంబర్ కోళ్ల శ్రీనివాస్, ఐటి విభాగం కన్వీనర్ యరమాటి వెంకన్నబాబులు పాల్గొన్నారు.

# ఖండవిల్లి లక్ష్మికి స్వర్ణ నంది అవార్డు

**హైదరాబాద్‌లో కళానిలయం ఘన సత్కారం**





**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్ర తెలంగాణ మహిళా చైర్మన్ ,టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా సెక్రటరీ,ఆల్ ఇండియా షెడ్యూల్డ్ కులాల రాష్ట్ర మహిళా విభాగం ప్రెసిడెంట్ డాక్టర్ ఖండవల్లి లక్ష్మికి స్వర్ణ నంది అవార్డు లభించింది. ఈమేరకు హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోనిప్రసాద్ ల్యాబ్ లో ఆదర్శ కళానిలయం సంస్థ నిర్వహించిన వేడుకలో ఖండవిల్లి లక్ష్మిని స్వర్ణ నంది అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు. జిల్లా ప్రముఖులు భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

### కల్తీపాల బాధితులకు అందుతున్న వైద్య సేవలపై

# ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజు పరిశీలన

**చేపట్టవలసిన వైద్య సేవలపై సూచనలు జారీ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కలెక్టర్ కీర్తి చేకూరి పర్యవేక్షణలో అప్రమత్తంగా జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలలో భాగంగా రాజమహేంద్రవరంలో నమోదైన ఆక్యూట్ రీనల్ ఫెయిల్యూర్ కేసులకు చెందిన అందచేస్తున్న వైద్య సేవలు నేపథ్యంలో, విశాఖపట్నం నుంచి వచ్చిన కిడ్నీ వ్యాధుల నిపుణుడు (నెఫ్రాలజిస్ట్) డాక్టర్ రవిరాజు బాధితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కిమ్స్, రెయిన్ బో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిని ఆయన సమగ్రంగా అంచనా వేశారు. రోగుల చికిత్సలో అనుసరించాల్సిన విధానంపై స్థానిక వైద్యులకు పలు సూచనలు జారీ చేశారు. ప్రస్తుతం ప్రోటోకాల్‌కు అనుగుణంగా సరైన వైద్యం అందుతోందని, అవసరమైన ఔషధాలు, డయాలిసిస్ సౌకర్యాలు, నిపుణుల పర్యవేక్షణ అందుబాటులో ఉన్నాయని డాక్టర్ రవిరాజు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు కలెక్టర్ కీర్తి చేకూరి పరిస్థితిని ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ, బాధితులకు అత్యుత్తమ వైద్యం అందేలా చర్యలు చేపడుతున్నట్లు రవిరాజు తెలిపారు. అవసరమైన వైద్య సదుపాయాలు, నిపుణుల సేవలు, అదనపు వైద్య బృందాల నియామకం వంటి అంశాల్లో జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందన్నారు. ప్రజలు ఎటువంటి అపోహలకు లోనుకాకుండా, కల్తీ పాలకు సంబంధించి ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే 9494060060 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని కలెక్టర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రముఖ నెఫ్రాలజిస్ట్ సూచనలు సలహాలు కోసం రాష్ట్ర ప్రభుత్వంను కోరడం జరిగిందని, ఆమేరకు జిల్లాకి చేరుకుని సూచన చేశారని, అవసరం అయితే మళ్ళీ రావడం జరుగుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలియ చేశారు.

### దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని

# అధికారికంగా నిర్వహించాలి

**శెట్టిబలిజ కార్పొరేషన్ డిమాండ్ - శెట్టిబలిజల అభ్యున్నతికి ఎన్డీయే కూటమి కృషి**
**- గొల్లపూడి బీసీ భవన్‌లో బోర్డు సమావేశం**
**- కుడుపూడి సత్తిబాబు అధ్యక్షతన శెట్టిబలిజ కార్పొరేషన్ కీలక తీర్మానాలు**



**విజయవాడ (గొల్లపూడి), విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్‌లో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ల కీలక సమావేశం జరిగింది. శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అధ్యక్షతన, కార్పొరేషన్ ఎం.డి జి.భీమశంకరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో కులస్తుల అభ్యున్నతి కోసం 15 ముఖ్యమైన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

**సమావేశంలోని ప్రధాన తీర్మానాలు:**

**బ్రిడ్జికి నామకరణం:** అమలాపురం నియోజకవర్గం అల్లవరం మండలం బోడకుర్రు నుండి పసర్లపూడి వెళ్లే బ్రిడ్జికి శెట్టిబలిజల ప్రముఖ నేత దొమ్మేటి వెంకటరెడ్డి పేరు పెట్టాలని తీర్మానించారు.

**అధికారిక జయంతి:** శెట్టిబలిజ జాతి ముద్దుబిడ్డ దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని (మార్చి 23) ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ తీర్మానం చేశారు.

**విద్యార్థులకు ప్రోత్సాహం:** పదో తరగతి నుండి డిగ్రీ పూర్తి చేసిన శెట్టిబలిజ కులానికి చెందిన విద్యార్థులకు 'ఆదరణ' పథకం కింద బైక్‌లు పంపిణీ చేయాలని బోర్డు నిర్ణయించింది.

**కుడుపూడి సత్తిబాబు వ్యాఖ్యలు:** బోర్డు మీటింగ్ అనంతరం కుడుపూడి సత్తిబాబు మీడియాతో మాట్లాడుతూ.. దొమ్మేటి వెంకటరెడ్డి జన్మదినాన్ని అధికారికంగా నిర్వహించే అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.శెట్టిబలిజల పట్ల ఎన్డీయే ప్రభుత్వం చూపుతున్న ఆదరణను ఆయన కొనియాడారు. "మద్యం షాపుల కేటాయింపులో 10 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు, లైసెన్స్ ఫీజులో 50 శాతం సబ్సిడీ ఇచ్చి శెట్టిబలిజలు ఆర్థికంగా బలోపేతం కావడానికి కృషి చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే" అని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు, పవన్, లోకేష్‌లకు శెట్టిబలిజ కులస్తులంటే ఎంతో ప్రేమని, దానికి ఈ నిర్ణయాలే నిదర్శనమని సత్తిబాబు కొనియాడారు.

# ఉస్తాద్ భగత్ సింగ్‌లో అవేం ఉండవు..

## తేల్చేసిన హరీష్ శంకర్..!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ - మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పాటకు వచ్చిన రెస్పాన్స్‌తో రాజకీయ సెటైర్లు ఉంటాయన్న ఊహాగానాలు వినిపించినా, దర్శకుడు హరీష్ శంకర్ దీనిపై క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రంలో ఎలాంటి రాజకీయ అంశాలు ఉండవని చెప్పారు. డిప్యూటీ సీఎం హోదాలో ఉన్నప్పటికీ, పవన్ కళ్యాణ్ ఈ సినిమాలో పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌తోనే ప్రేక్షకులను అలరించబోతున్నారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలున్నాయి. ఇటీవల విడుదలైన 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పాటకు వస్తున్న అద్భుతమైన రెస్పాన్స్ చూసి... పవన్ కళ్యాణ్ ప్రస్తుత రాజకీయ ఇమేజ్‌కు తగ్గట్టుగా సినిమాలో పవర్ ఫుల్ పొలిటికల్ సెటైర్లు, డైలాగులు ఉంటాయని అభిమానులు లెక్కలేసుకున్నారు. అయితే అందరి అంచనాలను తలకిందులు చేస్తూ.. సినిమాలో ఎలాంటి రాజకీయ అంశాలు, సెటైర్లు, రెఫరెన్సులు ఉండవని దర్శకుడు హరీష్ శంకర్ తాజాగా తేల్చి చెప్పారు. పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం హోదాలో ఉన్నప్పటికీ, ఈ సినిమా పూర్తిగా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా మాత్రమే ప్రేక్షకుల ముందుకు రాబోతోందని స్పష్టం చేశారు. సినిమాలో పాలిటిక్స్‌కు సంబంధించినవి ఏమీ ఉండవని ముందుగానే దర్శకుడు ప్రకటించడం వెనక ఒక స్పష్టమైన వ్యూహం, ఓ బలమైన కారణం ఉంది. సినిమాను రాజకీయాలతో ముడిపెట్టవద్దని, ఎవరినీ ఉద్దేశించి వ్యక్తిగతంగా లేదా ఏ రాజకీయ పార్టీని టార్గెట్ చేస్తూ డైలాగులు ఉండకూడదని పవన్ కళ్యాణ్ మొదటి రోజే హరీష్ శంకర్‌కు కచ్చితమైన ఆదేశాలు ఇచ్చారు. రాజకీయంగా సైద్ధాంతిక విభేదాలు ఉన్నప్పటికీ ప్రకాష్ రాజ్ లాంటి నటులతో పవన్ ఈ సినిమాలో కలిసి పనిచేయడమే ఆయన ఆలోచనా విధానానికి నిదర్శనం. అభిమానులు కేవలం పొలిటికల్ పంచ్‌ల కోసమే థియేటర్లకు వచ్చి నిరాశ చెందకూడదనే ఉద్దేశ్యంతోనే.. అంచనాలను బ్యాలెన్స్ చేయడానికి, అలాగే విడుదలకు ముందు అనవసర వివాదాలకు తావివ్వకుండా ఉండటానికి హరీష్ శంకర్ ఈ విషయాన్ని ముందుగానే క్లారిటీ ఇచ్చారు. అంతా బాగానే ఉన్నా.. పొలిటికల్ రిఫరెన్స్‌లు లేకపోతే రాజకీయంగా పవన్ సినిమా ఎలాంటి ఇంపాక్ట్ చూపుతుంది? అనే ప్రశ్న అందరిలోనూ మెదులుతోంది. వాస్తవానికి ఒక వర్గాన్ని టార్గెట్ చేసే డైలాగ్స్ లేకపోవడం వల్ల సినిమా రీచ్ మరింత పెరుగుతుంది. పవన్ కళ్యాణ్‌కు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల్లోనూ, వర్గాల్లోనూ అభిమానులు ఉన్నారు. సినిమాను పూర్తిగా పాలిటిక్స్‌కు దూరంగా ఉంచడం వల్ల, సగటు ప్రేక్షకుడు ఎలాంటి పక్షపాతం లేకుండా స్వచ్ఛమైన సినిమాను ఎంజాయ్ చేయగలుగుతారు. పవన్ కళ్యాణ్ మాస్ అప్పీల్‌ను, ఆయన ఆరాను ఇది మరింత పెంచుతుంది. పొలిటికల్ అంశాలు, సెటైర్లు లేకుండా ఉస్తాద్ నిలబడతాడా? అంటే కచ్చితంగా నిలబడతాడనే సమాధానమే వినిపిస్తోంది. గతంలో వీళ్ళిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ఇండస్ట్రీ హిట్ గబ్బర్ సింగ్ కేవలం వినోదం, పవన్ కళ్యాణ్ స్వాగ్, మేనరిజమ్స్ పైనే ఆధారపడి సంచలనం సృష్టించింది. ఉస్తాద్ భగత్ సింగ్‌లో కూడా పొలిటికల్ పంచ్‌లు లేకపోయినా.. పవన్ మార్క్ కామెడీ, హై-వోల్టేజ్ యాక్షన్, దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్, అన్నింటికీ మించి ఫ్యాన్స్‌కి కావాల్సిన హీరో ఎలివేషన్స్ పుష్కలంగా ఉంటాయని డైరెక్టర్ హామీ ఇస్తున్నారు. రోజుకు 18 గంటల పాటు కష్టపడి పవన్ ఈ సినిమా కోసం పనిచేశారు కాబట్టి, ఆయన ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్ పక్కా కమర్షియల్ మీల్స్ లాగా వర్కౌట్ అవుతాయి. మొత్తమ్మీద చూసుకుంటే.. 'ఉస్తాద్ భగత్ సింగ్' ఒక రాజకీయ అస్త్రంలా కాకుండా.. అభిమానులకు సగటు, అలాగే ప్రేక్షకులకు ఒక పూర్తి స్థాయి విందు భోజనంలా రాబోతోంది. రాజకీయాలకు, సినిమాకు మధ్య స్పష్టమైన గీత గీయడం పవన్ కళ్యాణ్ మెచ్యూరిటీని సూచిస్తుంది. కేవలం ఎలివేషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్ మాత్రమే నమ్ముకుని బరిలోకి దిగుతున్న ఈ చిత్రం.. కంటెంట్ బలంగా ఉంటే పొలిటికల్ వివాదాలతో పనిలేకుండానే బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటగలదు. మార్చి 26న విడుదల కానుంది ఈ చిత్రం.

సినీ వాయిస్ CINEMA

### కొడవ సంప్రదాయంలో

# విజయ్, రష్మిక వివాహం..!

### ఈ పెళ్లి స్పెషాలిటీ ఏంటంటే..!!



టాలీవుడ్ లవ్ బర్డ్స్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న మరికొద్ది రోజుల్లో వివాహబంధంతో ఒక్కటికాబోతున్నారు. ఇన్నాళ్లు ప్రేమలో మునిగి తేలిన ఈ ఇద్దరూ ఇప్పుడు పెళ్లిపీటలెక్కనున్నారు. విజయ్ దేవరకొండ, రష్మిక వివాహం ఈనెల 26న ఉదయపూర్‌లో గ్రాండ్‌గా నిర్వహించనున్నారు. స్టార్ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక వివాహం ఈనెల 26న ఉదయ్ పూర్ లో జరగనుంది. ఇప్పటికే వీరి పెళ్లి పనులు మొదలయ్యాయి. చాలా కాలంగా ఈ ఇద్దరూ ప్రేమలో ఉన్న సంగతి తెలిసిందే. కానీ వీరి లవ్ మ్యాటర్ ను చాలా వరకు గోప్యంగా ఉంచారు. అయితే వీరి పెళ్ళికి కొద్ది మంది అతిధులు మాత్రమే హాజరు కానున్నారు. విజయ్, రష్మిక వివాహంకు కుటుంబ సభ్యులు, కొద్దిమంది సన్నిహితల మధ్యనే జరగనుంది. ఆతర్వాత హైదరాబాద్ లో గ్రాండ్ గా రిసెప్షన్ వేడుక జరగనుందని తెలుస్తుంది. ఇప్పటికే వీరి పెళ్లి పత్రిక సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. దాంతో ఈ ఇద్దరి పెళ్లి ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే విజయ్, రష్మికతో ఉదయ్ పూర్ చేరుకున్నారు. కొడవ, తెలుగు సంప్రదాయాల ప్రకారం విజయ్ దేవరకొండ, రష్మిక వివాహం జరగనుంది. తెలుగు సంప్రదాయం ప్రకారం మాంగళ్య ధారణ జరగనుంది. కొడవ సంప్రదాయంలో పురోహితులకు ప్రాధాన్యత ఉండదు. పూర్వీకుల ఆశీస్సులే ప్రధానంగా కొడవ పెళ్లిళ్లు జరుగుతాయి. అలాగే ఒడి బియ్యం స్థానంలో వధువు కాసులు మూటగట్టుకొచ్చే పద్ధతి ఉంటుంది. అదేవిధంగా ప్రత్యేకమైన వస్త్రధారణ, వంటలు, వధువు తల్లికి ఉండే ప్రాధాన్యత కొడవ సంప్రదాయాన్ని ప్రత్యేకంగా చుపిస్తాయట. ఇలా విజయ్, రష్మిక పెళ్ళిలో చాలా వెరైటీస్ ఉండనున్నాయని తెలుస్తుంది. కాగా నేడు (మంగళవారం) మెహందీ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ఫిబ్రవరి 25న హల్దీ, సంగీత్ కార్యక్రమాలు జరుగుతాయి. ఈ ప్రైవేట్ కానీ రాయల్ ప్రీ-వెడ్డింగ్ ఫంక్షన్లకు కుటుంబ సభ్యులు, కొంతమంది సన్నిహితులు హాజరవుతారు. అలాగే వీరి వివాహనికి వచ్చే వివాహానికి వచ్చే అతిథులను కొబ్బరి నీళ్లతో స్వాగతించనున్నారు. అలాగే ఈ పెళ్లి వేడుకలలో జపనీస్ వంటకాలను సైతం సిద్ధం చేయనున్నారట.

క్రీడా వాయిస్

# టీమిండియా కొంపముంచిన ఆ ముగ్గురు..

## వరల్డ్ కప్ నుంచి భారత్ అవుట్?



టీ20 వరల్డ్ కప్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగిన టీమిండియా ఇప్పుడు ఇంటిదారి పట్టే పరిస్థితిలో ఉంది. పాయింట్ల పట్టికను చూస్తే, భారత్ ఉన్న గ్రూప్ నుంచి వెస్టిండీస్, సౌతాఫ్రికా జట్లు సెమీఫైనల్‌కు దూసుకెళ్లడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. అసలు వరల్డ్ ఛాంపియన్ అని పిలుచుకునే మన జట్టుకు ఈ దుస్థితి ఎందుకు వచ్చింది? ఎవరు దీనికి బాధ్యులు? ప్రధానంగా ముగ్గురు ఆటగాళ్ల పేలవ ప్రదర్శనే భారత జట్టును ఈ క్లిష్ట స్థితిలోకి నెట్టిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆ ముగ్గురు విలన్లు ఎవరో చూద్దాం. మొదటి పేరు అభిషేక్ శర్మ. భారత జట్టుకు బలమైన ఆరంభాన్ని ఇవ్వాల్సిన బాధ్యత కలిగిన ఈ ఓపెనర్, ఈ వరల్డ్ కప్‌లో ఘోరంగా విఫలమయ్యాడు. నాలుగు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఆయన చేసిన పరుగులు కేవలం 15 మాత్రమే. ఇందులో వరుసగా మూడు సార్లు డకౌట్ (సున్నాకే అవుట్) అయ్యి హాట్రిక్ నమోదు చేయడం గమనార్హం. ఓపెనర్ సరైన పునాది వేయకపోవడంతో మిగిలిన బ్యాటర్లు ఒత్తిడికి లోనయ్యారు. జట్టు స్కోరును కనీసం ముందుకు తీసుకెళ్లలేక అభిషేక్ చతికిలపడటం టీమ్ ఇండియా కొంపముంచింది. రెండో ఆటగాడు తిలక్ వర్మ. 2025 ఆసియా కప్ ఫైనల్లో అద్భుతమైన ఇన్నింగ్స్‌తో భారత్‌ను గెలిపించిన హీరో, ఇప్పుడు జీరోగా మారాడు. ఈ వరల్డ్ కప్‌లో ఐదు ఇన్నింగ్స్‌ల్లో కలిపి కేవలం 107 పరుగులు మాత్రమే చేశాడు. స్ట్రైక్ రేట్ 119 మాత్రమే ఉండటం, కనీసం ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయకపోవడం తిలక్ వైఫల్యానికి నిదర్శనం. సగటు కేవలం 21.40 వద్దే ఆగిపోయింది. అభిషేక్ విఫలమైనప్పుడు మిడిల్ ఆర్డర్‌లో తిలక్ ఆదుకుంటాడని మేనేజ్మెంట్ ఆశించినా, ఆయన ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోయాడు. ఇక మూడో వ్యక్తి వాషింగ్టన్ సుందర్. గాయం నుంచి కోలుకున్న తర్వాత నేరుగా సూపర్-8 వంటి కీలక మ్యాచ్‌లో సుందర్‌కు అవకాశం ఇచ్చారు. వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్‌ను కాదని మరీ సుందర్‌ను తీసుకున్న మేనేజ్మెంట్ నమ్మకాన్ని ఆయన వమ్ము చేశాడు. ఐదో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చి కేవలం 11 పరుగులు మాత్రమే చేశాడు. ఇక బౌలింగ్‌లోనైనా మ్యాజిక్ చేస్తాడనుకుంటే ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. ఇలా కీలక ఆటగాళ్లు చేతులెత్తేయడంతో టీమిండియా సెమీస్ రేసులో వెనుకబడిపోయింది.

# పల్లెకెలెలో పాక్-ఇంగ్లండ్ పోరు..

శ్రీలంకలోని పల్లెకెలె వేదికగా నేడు టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్ 8 రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది. గ్రూప్-2లో భాగంగా పాకిస్థాన్, ఇంగ్లండ్ జట్లు తలపడనున్నాయి. భారత కాలమానం ప్రకారం రాత్రి 7 గంటలకు ప్రారంభం కానున్న ఈ మ్యాచ్, పాకిస్థాన్‌కు చావో రేవో లాంటిది. సెమీఫైనల్ రేసులో నిలవాలంటే ఇంగ్లండ్‌పై పాక్ ఖచ్చితంగా గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో అసలు పల్లెకెలెలో వాతావరణం ఎలా ఉంది? ఒకవేళ వర్షం పడి మ్యాచ్ రద్దయితే పాక్ పరిస్థితి ఏంటనే ఆసక్తికరమైన లెక్కలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి. ముందుగా పాయింట్ల పట్టికను గమనిస్తే.. ఇంగ్లండ్ జట్టు ప్రస్తుతం 2 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. వారి నెట్ రన్ రేట్ (o2.550) కూడా చాలా బలంగా ఉంది. మరోవైపు పాకిస్థాన్ ఆడిన మొదటి మ్యాచ్ వర్షం కారణంగా రద్దవ్వడంతో, న్యూజిలాండ్‌తో పాయింట్లు పంచుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం పాక్ ఖాతాలో కేవలం ఒకే ఒక పాయింట్ ఉంది. ఆతిథ్య శ్రీలంక పాయింట్లు ఏమీ లేకుండా అట్టడుగున ఉండగా, నేటి మ్యాచ్ ఫలితం పాకిస్థాన్ భవితవ్యాన్ని తేల్చనుంది. ఒకవేళ నేడు కూడా పల్లెకెలెలో వరుణుడు ప్రతాపం చూపి మ్యాచ్ రద్దయితే, పాకిస్థాన్ పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోతుంది. వర్షం వల్ల మ్యాచ్ ఆగిపోతే ఇరు జట్లకు చెరో పాయింట్ లభిస్తుంది. అప్పుడు ఇంగ్లండ్ 3 పాయింట్లతో ముందంజలో ఉంటుంది, పాక్ 2 పాయింట్లతో మిగిలిపోతుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 28న శ్రీలంకపై పాక్ గెలిచినా, గరిష్టంగా 4 పాయింట్ల వరకు మాత్రమే వెళ్లగలదు. అప్పుడు పాక్ సెమీస్ చేరడం అనేది ఇతర జట్ల ఓటమిపై, తమ నెట్ రన్ రేట్‌పైనే ఆధారపడి ఉంటుంది. శ్రీలంకపై భారీ విజయం సాధించి రన్ రేట్‌ను మెరుగుపరుచుకుంటేనే పాక్‌కు సెమీస్ తలుపులు తెరుచుకుంటాయి. అయితే పాకిస్థాన్ అభిమానులకు ఒక స్వీట్ న్యూస్ ఏంటంటే.. నేడు పల్లెకెలెలో వాతావరణం క్రికెట్‌కు అనుకూలంగా ఉంది. వాతావరణ శాఖ నివేదిక ప్రకారం నేడు వర్షం కురిసే అవకాశాలు దాదాపు లేవు. ఆకాశం చాలా స్పష్టంగా ఉంటుందని సమాచారం. కాబట్టి ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తి 20 ఓవర్ల మ్యాచ్ జరిగే అవకాశం ఉంది. ఇంగ్లండ్‌ను ఓడించి పూర్తి 2 పాయింట్లు సాధిస్తే, పాకిస్థాన్ తన సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకోవడమే కాకుండా గ్రూప్‌లో పటిష్ట స్థితికి చేరుకుంటుంది. మరి బాబర్ ఆజం సేన ఈ అవకాశాన్ని ఎలా సద్వినియోగం చేసుకుంటారో చూడాలి.




విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com